JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 25-01-2026
Medchal - Malkajgiri | Sunday 25-01-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 239
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 239 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





2 లో

## ట్రంప్‌కు ఊహించని షాక్..!

### ఆ విషయంలో భారత్‌కు అండగా నిలిచిన 27 దేశాలు!

జయభేరి, న్యూఢిల్లీ:

అగ్రరాజ్యం అమెరికాకు ఓ 27 దేశాలు ఊహించని షాక్ ఇచ్చాయి. అది కూడా భారత్ కోసం. రష్యా చమురు కొనుగోలు నెపంతో భారత్‌పై తీవ్రమైన ఆంక్షలు, సుంకాలను విధించాలని అమెరికా భావించింది. కానీ యూరోపియన్ యూనియన్ (EU) లోని 27 దేశాలు ఆ నిర్ణయాన్ని ఖండించాయి. దీని వెనుక భారీ వాణిజ్య ఒప్పందం కారణంగా నిలిచింది. ఈ మొత్తం సమస్య రష్యన్ చమురుతో మొదలవుతుంది. రష్యా ఆర్థిక వెన్నెముకను విచ్ఛిన్నం చేయాలని అమెరికా భారత్‌పై ఒత్తిడి తీసుకురావాలని భావించింది. దీని కోసం రష్యన్ చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌పై ఉమ్మడి సుంకాలు విధించాలని అమెరికా యూరోపియన్ దేశాలను కోరింది. అయితే యూరోపియన్ దేశాలు అలా చేయడానికి నిరాకరించినట్లు అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ చెప్పారు.
ఇటీవల బెస్సెంట్ ఒక ఇంటర్వ్యూలో తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ తన యూరోపియన్ మిత్రదేశాలు సుంకాలు విధించడానికి నిరాకరించాయని అన్నారు. యూరప్ ద్వంద్వ ప్రమాణాలను అవలంబిస్తోందని అమెరికా ఆరోపించింది.

## మేడారం జాతరకు ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం



2 లో

- రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

జయభేరి, మేడారం :

శ్రీ సమ్మక్కసారలమ్మల మహాజాతర 2026ను పురస్కరించుకుని భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో మేడారంలో ఏర్పాటు చేసిన క్యూలైన్ కాంప్లెక్సులు, బస్టాండ్ను శనివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.
శనివారం ఉదయం మేడారం చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఆలయ పూజారులు ఆదివాసి సాంప్రదాయాలతో డోలు వాయిద్యాలతో ఆహ్వానం పలికారు. వనదేవతలను దర్శించుకున్న మంత్రి పొన్నం తమ ఎత్తు బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మేడారం జాతరకు భారీ రవాణా ఏర్పాట్లు, 4000 ఆర్టీసీ బస్సుల సౌకర్యం, మహిళలకు ఉచిత ప్రయాణం తప్పనిసరిగా ఉంటుందని మేడారం పర్యటించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అనంతరం మేడారంలో క్యూ లైన్ కాంప్లెక్స్, బస్టాండ్ ప్రారంభించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## టెండర్ డాక్యుమెంట్లు వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లేదు



- పెట్టుబడులు, కట్టుకథలు, పిట్టకథల విష పలుకులతో తప్పుడు ప్రచారానికి రాధాకృష్ణ తెరలేపారు
- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

జయభేరి, హైదరాబాద్, జనవరి 24 :

సింగరేణిపై కొన్ని రోజులుగా కొన్ని కట్టుకథలు, రాతలు వచ్చాయని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. పెట్టుబడులు, కట్టుకథలు, పిట్టకథల విష పలుకులతో తప్పుడు ప్రచారానికి రాధాకృష్ణ తెరలేపారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజాభవన్ లో భట్టి మీడియాతో మాట్లాడుతూ.. రకరకాలుగా అపోహలు ప్రచారం చేశారని, రాష్ట్ర ప్రభుత్వంపై కావాలని

...మిగతాది 2 లో



## స్టార్టప్ ల కేంద్రంగానే టీ హబ్


- రేవంత్ సర్కార్ క్లారిటీ

జయభేరి, హైదరాబాద్, జనవరి 24 :

తెలంగాణలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన టీ హబ్‌ను ప్రభుత్వ కార్యాలయాలకు ఇవ్వడం లేదని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికాలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్‌తో మాట్లాడారు. టీ హబ్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగానే ఉంచాలని చూసించారు. అక్కడికి ప్రభుత్వ కార్యకలాపాలను తరలించొద్దని సూచించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీస్‌లను వేరే ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని చెప్పారు. హైదరాబాద్‌లో చాలా ప్రభుత్వ ఆఫీస్‌లు ఇంకా అద్దె భవనాల్లో ఉంటున్నాయి. అయితే వాటికి నెల నెల కోట్ల రూపాయల అద్దెలు చెల్లించడం ప్రభుత్వానికి భారంగా మారుతోంది. అందుకే వాటిని ప్రభుత్వ భవనాలకు తరలించాలని ఆలోచించారు. అయితే ఇంక్యుబేటర్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన టీ హబ్‌లోకి తరలిస్తున్నారనే వార్త

...మిగతాది 2 లో

## సబ్‌రిజిస్ట్రార్ ఆస్తులు ఏకంగా రూ.100 కోట్లు




- ఏసీబీ వలకి చిక్కిన భారీ అవినీతి తిమింగలం!

జయభేరి, హైదరాబాద్, జనవరి 24:

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల దందా షరా మామూలే. ముఖ్యంగా రెవెన్యూశాఖలో ఎందెందు వెతికినా.. అందందె లంచం రాయుళ్లు దర్శనమిస్తారు. తాజాగా మరో అవినీతి తిమింగలం ఏసీబీ అధికారుల వలకు చిక్కింది. ఏకంగా రూ.100 కోట్ల ఆస్తులు కూడబెట్టిన ఓ రెవెన్యూ అధికారి ఏసీబీ అధికారులకు దొరికాడు. ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టినందుకు ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ (SRO1) కె. మధుసూధన్ రెడ్డిపై ACB అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతనిపై ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి, విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో మేడ్చల్ మల్కాజ్‌గిరిలోని

...మిగతాది 2 లో

## నగరిలో చంద్రబాబు పర్యటన



జయభేరి, తిరుపతి, జనవరి 24 :

రాష్ట్రంలో పరిశుభ్రత అనేది కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, ప్రజలందరి జీవన విధానంగా మారాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు సేవలను కొనియాడారు. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చి చివరి శ్వాస వరకు ప్రాంతాభివృద్ధి కోసం పని చేసిన వ్యక్తి ముద్దుకృష్ణమ అని గుర్తుచేసుకున్నారు. ప్రతీ నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పేదల సేవలో వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నామని సీఎం వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛత కోసం రూ.573 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా రూ.510 కోట్లతో 110 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం పట్టణాల్లో లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పేరుకుపోయేలా వదిలేసిందని, దానివల్ల భూగర్భ జలాలు, వాయు కాలుష్యం పెరిగిందని విమర్శించారు. ప్రస్తుతం 112 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను పూర్తిగా తొలగించి, వంద శాతం చెత్త సేకరణే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇఆటోలు, ట్రై సైకిళ్లను అందుబాటులోకి తెచ్చామని, వ్యర్థాల

...మిగతాది 2 లో

## ఎన్నికల బరిలోకి కేసీఆర్ కూతురు




2 లో

- సింహం గుర్తుతో రంగంలోకి..

జయభేరి, హైదరాబాద్, జనవరి 24 :

భారత రాష్ట్ర సమితితో తెగదెంపులు చేసుకొని బయటకు వచ్చిన మాజీ ఎమ్మెల్సీ కేసీర్ కుమార్తె కవిత వచ్చే స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే తన సొంత రాజకీయ పార్టీ అయిన జాగృతి పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో.. ఈ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిపి పోటీ చేసేలా ఒప్పందం కుదుర్చుకునే పనిలో ఉన్నారు. అన్ని సెట్ అయితే ఈ పార్టీ గుర్తుపైనే కవిత ఎన్నికల బరిలోకి దిగనున్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి సింహం గుర్తు ఎప్పటినుంచో ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలన్న, ఏదైనా పార్టీ రెబల్గా పోటీ చేయాలన్న ఈ సింహం గుర్తుపై చాలామంది ఆధారపడతారు.

## పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ స్పష్టం

- ఎంపీలు బండి సంజయ్, అరవింద్‌కు లీగల్ నోటీసులు..
- సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించిన కేటీఆర్..!



2 లో



## బంగారు వర్ణంలో మెరిసిపోతున్న మేడారం

- వనదేవతల దర్శనం కోసం పోటెత్తున్న భక్తులు..!

జయభేరి, మేడారం :

మేడారానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. మహా జాతర సమీపిస్తుండడంతో రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. మహా జాతర ముందే.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు.. వివిధ ప్రాంతాల నుంచి భక్తజనం లక్షలాదిగా తరలివస్తున్నారు. దీంతో మేడారంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ప్రత్యేకించి.. మేడారంలోని పలు ప్రాంతాల్లో ఉదయంసాయంత్రం రాత్రి వేళ్లలోని డ్రోన్ దృశ్యాలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. సమ్మక్కసారలమ్మ గద్దెల ప్రాంగణం రాత్రి వేళ బంగారు వర్ణంలో మెరిసిపోయింది. ఆయా దృశ్యాలను చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్లుగా ఉన్నాయి. సెలవు దినాలు కావడంతో మేడారం వైపు జనం అడుగులు పడుతున్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులన్నీ భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రైవేటు వాహనాల్లోనూ వేలల్లో తరలివస్తున్నారు. నార్లాపూర్, ఊరట్టం, మేడారంలోని ఖాళీ స్థలాలు, జాతర పరిసరాల్లో ప్రైవేటు వాహనాల జాతర కొనసాగుతోంది. వీటికి సంబంధించిన డ్రోన్ దృశ్యాలు అలరిస్తున్నాయి. మేడారం దార్లు, సెంటర్లు, సర్కిల్స్ అన్నీ.. కలర్ ఫుల్ విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్ముతున్నాయి.

▸▸ మొదటిపేజీ తరువాయి

## ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

ఉత్తర తెలంగాణ, హైదరాబాద్ పాటు రాష్ట్రవ్యాప్తంగా 51 కేంద్రాల నుంచి దాదాపు 4000 ఆర్టీసీ బస్సులను మేడారం జాతర కోసం ప్రణాళికాబద్ధంగా నడుపుతున్నట్లు వెల్లడించారు. భక్తుల రద్దీ పెరిగితే మరిన్ని బస్సులు కూడా అందుబాటులో ఉంచేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు గుర్తు చేసిన మంత్రి, జాతర సందర్భంగా కూడా రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరికీ ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. భక్తులు సొంత వాహనాల కంటే ఆర్టీసీ బస్సుల ద్వారానే మేడారానికి రావాలని కోరారు. సొంత వాహనాలతో వస్తే దూరంగా పార్కింగ్ చేయాల్సి రావడంతో పాటు నడకలో ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. అందుకే ప్రజలు ప్రభుత్వ బస్సులనే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.జాతరలో 91 బస్ కేంద్రాల్లో క్యూ లైన్లు, షెల్టర్లు, తాగునీరు, వాష్రూములు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా బస్సులు మధ్యలో నిలిచిపోతే వెంటనే పరిష్కరించేందుకు క్రేన్లు, మొబైల్ టీమ్స్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ట్రాఫిక్ జామ్ కాకుండా జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈసారి ప్రత్యేకంగా చిల్డ్రన్ ట్రాకింగ్ మానిటరింగ్ సిస్టమ్ అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. 11 ప్రధాన బస్ స్టాండ్లలో పిల్లల పేరు, మొబైల్ నంబర్ నమోదు చేసి చేతికి ట్రాకింగ్ ట్యాగ్ కట్టే విధానం ద్వారా తప్పిపోయిన పిల్లలను వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి సీతక్క సారథ్యంలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా మేడారం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఫారెస్ట్, ఎకో టూరిజం దృష్ట్యా భక్తుల సంఖ్య ఏటా పెరుగుతున్న నేపథ్యంలో శాశ్వత బస్ స్టాండ్, శాశ్వత క్యూ లైన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి సంవత్సరం తాత్కాలిక ఏర్పాట్లకు ఖర్చయ్యే కోట్ల రూపాయలను తగ్గించేందుకే శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగే మహా జాతరలో భక్తులను క్షేమంగా తీసుకురావడం, తిరిగి స్వస్థలాలకు చేర్చడం రవాణా శాఖ ప్రధాన బాధ్యతగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

## స్టార్టప్ ల కేంద్రంగానే టీ హబ్

ఈ టైంలో ప్రచారంలోకి వచ్చింది. వెంటనే ప్రతిపక్షాలు స్వరం పెంచాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ ఈ నిర్ణయం సరికాదని మండిపడింది. నాడు స్టార్టప్‌లకు ప్రాణం పోసేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తే ఇప్పుడు వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చంపేస్తోందని విమర్శించింది. ఇది ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమని ఆరోపణలు చేసింది. గంటల వ్యవధిలోనే సోషల్ మీడియాలో దీనిపై చర్చ మొదలైపోయింది. జరుగుతున్న ప్రచారాన్ని జరగబోయే ప్రమాదాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. సీఎస్ రామకృష్ణారావుకు ఫోన్ చేసి అలాంటి ఆలోచనలు చేయొద్దని సూచించారు. దానికి బదులు వేరే ప్రభుత్వ బిల్డింగ్స్‌లో ఉన్న స్పేస్‌ను వాడుకోవాలని అన్నారు. టీ హబ్ కేవలం స్టార్టప్‌లకు కేంద్రంగా ఉంటుందని స్పష్టం చేశారు.

## టెండర్ డాక్యుమెంట్లు వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లేదు

తప్పుడు కథనాలు రాస్తున్నారని విమర్శించారు. ఏ రాబంధులు, ఏ గద్దలు, ఏ దోపిడీ దారుల ప్రయోజనాల కోసమో ఈ కథనాలు వస్తున్నట్లు కనిపిస్తోందని తెలియజేశారు. ఏ నినాదం వెనక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో? అని..తొలిపలుకుల రాతల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో? అని సందేహం వ్యక్తం చేశారు.అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతున్నారని, సింగరేణి కథనంపై రెండు అంశాలు లేవనెత్తారని మండిపడ్డారు. అందరికీ వాస్తవాలు తెలియజేసేందుకు డాక్యుమెంట్లు కూడా ఇస్తామని అన్నారు. బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాయడం మంచిదేనని, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విచారణ చేస్తామనడం కూడా మంచిదేనని భట్టి పేర్కొన్నారు. అందరి నిర్ణయాలను తాము స్వాగతిస్తున్నామని, 2018 లోనే టెండర్ డాక్యుమెంట్ కోల్ ఇండియా తయారు చేసి పంపించిందని అన్నారు. సైట్ విజిట్ తప్పనిసరి అని కోల్ ఇండియానే పెట్టిందని, నిజానిజాలు బయటకు రావాలని.. వాస్తవాలు ప్రజలకు తెలియాలని చెప్పారు. పత్రికలు, నాయకులే కాదు..సోషల్ మీడియాలో కూడా ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని, టెండర్ డాక్యుమెంట్లు వచ్చినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లేదని అన్నారు. గత డాక్యుమెంట్ల ఆధారంగానే సింగరేణి టెండర్లు పిలిచిందని, అడ్డగోలు ప్రచారం చేసేవారి అసలు రూపం బయటపడాలని అన్నారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ తప్పనిసరి అని ఎన్ఎమ్ డిసి కూడా చెప్పిందని, రైల్వే శాఖలో కూడా టెండర్ వేసే కంపెనీ సైట్ విజిట్ తప్పనిసరి అని నిబంధన ఉందని తెలిపారు. హిందూస్థాన్ కాపర్స్ సంస్థలో కూడా సైట్ విజిట్ రూల్ ఉందని, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీస్ లిమిటెడ్ లోనూ సైట్ విజిట్ నిబంధన ఉందని అన్నారు. గుజరాత్ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ టెండర్లలోనూ ఆ రూల్ ఉందని, సెంట్రల్ మైనింగ్, డిజైనింగ్ అండ్ ప్లానింగ్ అనే సంస్థ సైట్ విజిట్ అనే నిబంధన పెట్టిందని అన్నారు. రాధాకృష్ణా ఎవరి ప్రయోజనాల కోసం.. ఎవరి కళ్లలో ఆనందం చూడాలని రాశారో? అని ప్రశ్నించారు. రాధాకృష్ణ తన ఆనందం తాను వెతుక్కున్నారని చురకలంటించారు.దేశంలోని చాలా కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలు సైట్ విజిట్ అనే నింబంధన పెట్టాయని, సైనిక్ స్కూల్, దీన్ దయాళ్ పోర్టు టెండర్ లో కూడా ఇలాంటి నిబంధనలే ఉన్నాయని అన్నారు. అసలు.. సృజన్ రెడ్డి ఎవరు? అని సైట్ విజిట్ పెడితే.. సృజన్ రెడ్డికి ఎలా ఇస్తారు? అని ప్రశ్నించారు. సోదా కంపెనీ ఎండి దీప్తి రెడ్డి.. ఆమె కందాల ఉపేందర్ రెడ్డి కూతురు అని.. కందాల ఉపేందర్ రెడ్డి అల్లుడే సృజన్ రెడ్డి అన్నారు. ఆర్ జి ఒసి2 సి5 కంపెనీకి ఇచ్చారని, బిఆర్ఎస్ హయాంలో హర్ష కంపెనీ ఎవరిదో అందరికీ తెలుసు అని అన్నారు. కందాల ఉపేందర్ రెడ్డి కాంగ్రెస్ లో గెలిచినా.. బిఆర్ఎస్ తీసుకుని పోయిందని ఎద్దేవా చేవారు. తాను ఆస్తులు సంపాదించుకోవడానికి రాలేదని, రాధాకృష్ణ మీరు తప్పుడు రాతలు రాశారని అన్నారు. తన వ్యక్తిత్వాన్ని ఒక్క రోజులో ఒక్క కలంతో రాస్తానంటే ఊరుకోమని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

## నగరిలో చంద్రబాబు పర్యటన

నుంచి విద్యుత్ తయారు చేసే యూనిట్లను కూడా విస్తరిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసి చూపిస్తోందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఆడపడుచుల సంక్షేమం కోసం స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా ఏడాదికి రూ.33 వేల కోట్లను పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తూ పేదల ఆర్థిక భద్రతకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. పాఠశాల విద్యార్థుల్లో పరిశుభ్రత పట్ల అవగాహన పెంచేందుకు ముస్తాబు అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని ఆయన వివరించారు. నేరగాళ్లు రాజకీయాలు చేయడం వల్ల గతంలో రాష్ట్ర భవిష్యత్తు దెబ్బతిన్నదని, ఇప్పుడు మళ్లీ పరిశుభ్రమైన, కాలుష్య రహితమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ప్లాస్టిక్, ఇవేస్ట్ సేకరణ కోసం 130 స్వచ్ఛ రథాలను ఇప్పటికే ఏర్పాటు చేశామని, 2026 మార్చి నాటికి వీటి సంఖ్యను 660కి పెంచుతామని వెల్లడించారు. ఇల్లు మాత్రమే కాదు, మన పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలందరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో స్వర్ణాంధ్రను సాకారం చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ఇండియా ఆపరేషన్ సముద్ర



చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకుంది. సూర్యుడి మీద కూడా ప్రయోగాలు చేస్తోంది. అంతరిక్షంలో భారతీయ జెండాలు రెపరెపలాడించింది. నింగి, నేల, అంతరిక్షం.. ఇలా మూడు విభాగాలలో భారత్ తన సత్తాను చూపించింది. ఇకపై నీటిలో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోబోతోంది. అంతరిక్ష ప్రయోగాలతో ప్రపంచాన్ని మొత్తం తన వైపు తిప్పుకున్న భారత్.. ఇప్పుడు సముద్రంలో కూడా ప్రయోగాలను మొదలు పెట్టబోతోంది. ఎందుకంటే సముద్రంలో విపరీతమైన ఖనిజాలు.. విలువైన నిక్షేపాలు ఉన్నాయి. ఆ విలువైన నిక్షేపాలను గనుక బయటికి తీస్తే భారత ఆర్థిక ముఖ చిత్రం పూర్తిగా మారిపోతుంది.భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అతి త్వరలోనే సముద్రయాన్ ప్రాజెక్టుతో సముద్రపు లోపల ఉన్న రహస్యాలను తెలుసుకునేందుకు కీలక ప్రయోగం చేపట్టనుంది.. రెండేళ్ల క్రితమే సముద్రయాన్ ప్రాజెక్టును ఇస్రో అనౌన్స్ చేసింది.. అందుకోసం ప్రత్యేక సబ్ మెరైన్ ను రూపొందించింది. సముద్రయాన్ మిషన్ అనే ప్రయోగం ద్వారా మహా సముద్రాల అన్వేషణలో భాగంగా సముద్రాల లోపల ఉన్న ఖనిజ సంపదను అన్వేషించడానికి భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు మరో అడుగు ముందుకు వేసి మహా సముద్రాలలో ఉన్న ఖనిజ సంపదను కనుగొనేందుకు మత్స్య 6000 అనే సబ్ మెర్సిబుల్ మిషన్ ద్వారా చెన్నై తీరంలోని 5 వేల మీటర్ల లోతులో ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టారు. ఆ తర్వాత మరింత లోతులో పరిశోధనలు చేపట్టనుంది. మన దేశ పరిశోధకులు సముద్రయాన్ ప్రయోగాన్ని మొదలుపెట్టారు. ఈ ప్రయోగంలో భాగంగా చెన్నై ఆధ్వర్యంలో నాలుగో తరం సబ్ మెరైన్ మత్స్య 600 ను మే నెలలో సముద్ర జలాల్లోకి ప్రవేశపెడతారు.డీప్ ఓషియన్ మిషన్ లో భాగంగా ఈ సబ్ మెరైన్ ను రూపొందించారు. 500 మీటర్ల లోతు వరకు ముగ్గురు ఆక్వా నాట్స్ ఇందులో ప్రయాణిస్తారు. ఒకవేళ కనుక ఈ ప్రయోగం విజయవంతం అయితే అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్ సరసన భారత్ నిలుస్తుంది. సముద్ర జలాల్లో విలువైన నిక్షేపాలతో పాటు, అరుదైన ఖనిజాలు కూడా ఉన్నాయి. కాకపోతే వీటిని అన్వేషించడం అంత సులువు కాదు. సముద్ర అంతర్భాగంలో అత్యంత కఠినమైన వాతావరణం ఉంటుంది. సముద్రాలలో నిత్యం జలాలు ఆటుపోట్లకు గురవుతుంటాయి. అంతర్భాగంలో కూడా విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. అలాంటప్పుడు అందులో ప్రయోగాలు చేయడం కత్తి మీద సాము లాంటిది. సబ్ మెరైన్ లు కూడా కొన్ని సందర్భాలలో ప్రమాదాలకు గురవుతుంటాయి. ఇన్ని ప్రతికూలతలు ఉన్నాయి కాబట్టి.. సముద్రంలో ప్రయోగాలు చేయడం అంత ఈజీ కాదు. సముద్ర గర్భంలో నిక్షేపాలను బయటకు తీస్తే.. వాటి ద్వారా ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. ప్రయోగం విజయవంతం అయితే 2026 లేదా 2027 చివరిలో మానవ సహిత సముద్రయాన్ ప్రాజెక్ట్ ను ఇస్రో జరుపనుంది. 28 టన్నులు బరువు కలిగిన మత్స్య 6000 అనే సబ్ మెరైన్ మిషన్ ద్వారా ఈ ప్రాజెక్ట్ ను జాతీయ మహా సముద్ర సాంకేతిక సంస్థ ద్వారా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ పర్యవేక్షణలో సముద్రయాన్ మిషన్ ను పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో మానవ సహిత గా ముగ్గురు శాస్త్రవేత్తలను ఎంపిక చేసి ఇందులో ప్రయాణించనున్నారు.అంతరిక్షంలో పరిశోధనలు చేపట్టే శాస్త్రవేత్తలను ఆస్ట్రోనాట్స్ గా పిలుస్తారు. సముద్రం లోపల పరిశోధనలు చేసే వాళ్లను ఆక్వానాట్స్ గా పిలుస్తారు. ఫ్రాన్స్ సహకారంతో భారత్ సముద్రయాన్ ప్రయోగాన్ని చేపడుతుంది. ఇందులో ముగ్గురు శాస్త్రవేత్తలు సబ్ మెరైన్ లో వెళ్లి పరిశోధన చేస్తారు. అందులో ఇద్దరు భారత కు చెందిన శాస్త్రవేత్తలు ఇప్పటికే పరిశోధనలు మొదలుపెట్టారు. వారిలో జితేంద్ర పాల్ సింగ్, రాజు రమేష్ లు ఇప్పటివరకు 5000 మీటర్ల లోతు వరకు డైవ్ చేసిన భారత్ రికార్డుగా ఈ ప్రయోగం ద్వారా సాధించారు. ఈ సబ్మెర్సిబుల్ 12 గంటల పాటు పనిచేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో 96 గంటల వరకు కూడా సముద్రం లో ఉండే సామర్థ్యం కలిగి ఉంది. ప్రయోగం ద్వారా సముద్రంలో ఉన్న ఖనిజాలు, ఖనిజ సంపద, మినరల్స్, కోరల్స్ వంటి ఖనిజాలతో పాటుగా సముద్రంలో ఉన్న ఇసుకలో కూడా ఏతరహా ఖనిజాలు ఉన్నాయి.. వాటి ఉపయోగాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు .ఈ తరహా ప్రయోగాలను ఇప్పటివరకు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్, చైనా లాంటి దేశాలు మాత్రమే చేశాయి.. ఇప్పుడు ఇస్రో కూడా ఈ దేశాల సరసన చేరనుంది. ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగానికి సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఇస్రో ఒకవైపు గగన్ యాన్ ద్వారా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు సిద్ధమవుతూనే సముద్రం లోపల శాస్త్రవేత్తల ద్వారా అత్యంత క్లిష్టమైన కీలకమైన ప్రయోగ ప్రక్రియను పూర్తిచేసే దశలో ఉండటం గర్వకారణమని పలువురు పేర్కొంటున్నారు.ఫలితంగా భారత ఆర్థిక ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది. భారత్ అభివృద్ధి చెందిన దేశంలా కాకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరం చెందుతుంది. ఉపాధి కోసం మన దేశ యువత విదేశాలకు వెళ్లకుండా.. ఇక్కడే పనిచేసే పరిస్థితి ఏర్పడుతుంది.

# పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ స్పష్టం




- ఎంపీలు బండి సంజయ్, అరవింద్‌కు లీగల్ నోటీసులు..
- సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించిన కేటీఆర్..!

జయభేరి, హైదరాబాద్, జనవరి 24 :

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకుగానూ బీజేపీ ఎంపీలు బండి సంజయ్ కుమార్, ధర్మపురి అరవింద్ లకు విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వీరు చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా పరిగణించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అడ్డగోలుగా మాట్లాడిన వీరు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధికోసం బీజేపీ ఎంపీలు బండి సంజయ్, అరవింద్‌లు తన పరువుకు నష్టం కలిగించేలా మాట్లాడడాన్ని కేటీఆర్ ఖండించారు. ఎలాంటి సాక్షాధారాలు లేకుండా కేవలం దురుద్దేశ పూర్వకంగా, రాజకీయాల కోసం వీరిరువు దిగజారి మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే కేంద్రమంత్రి బండి గతంలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసు న్యాయస్థానంలో ఉన్నప్పటికీ, చట్ట వ్యతిరేకంగా ఆయన మరోసారి తనపై నోరు పారేసుకున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ మేరకు బండి సంజయ్, అరవింద్‌లకు కేటీఆర్ తన న్యాయవాదులతో నోటీసులు పంపించారు. బండి సంజయ్‌కు పంపిన నోటీసులో, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఆయన చేసిన ఆరోపణలను కేటీఆర్ న్యాయవాదులు ప్రస్తావించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా వేల కోట్ల రూపాయలు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ జనవరి 23న ప్రెస్ మీట్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తున్నప్పటికీ, మళ్ళీ అదే తరహాలో తప్పుడు ఆరోపణలు చేయడం దురుద్దేశపూర్వకమని కేటీఆర్ మండిపడ్డారు. మరోవైపు ఎంపీ ధర్మపురి అరవింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్నారంటూ అరవింద్ చేసిన వ్యాఖ్యలు అక్షేపణీయమని కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ రాష్ట్ర అభివృద్ధికి, ఐటీ రంగ విస్తరణకు కృషి చేసిన మాజీ మంత్రి అని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అని, అటువంటి వ్యక్తిపై ఎటువంటి సాక్ష్యాలు లేకుండా అడ్డగోలుగా మాట్లాడడం రాజకీయ కక్ష సాధింపేనని న్యాయవాదులు లీగల్ నోటీసులో వివరించారు. ఈ ఇద్దరు ఎంపీలు తమ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, కేటీఆర్‌కు బహిరంగంగా నిబంధనలు లేని క్షమాపణలు చెప్పాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. నోటీసు అందిన ఐదు రోజుల్లోగా స్పందించని పక్షంలో సివిల్, క్రిమినల్ చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడితే న్యాయపరంగా మూల్యం చెల్లించుకోక తప్పదని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఎన్నికల బరిలోకి కేసీఆర్ కూతురు

గతంలో మంత్రి జూపల్లి బిఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తిరుగుబాటు జెండా ఎగరవేసి కొల్లాపూర్ మున్సిపాలిటీలో మెజార్టీ సీట్లు సాధించారు. సింహం గుర్తు ప్రజల్లో ఆకట్టుకునే లాగా ఉండడంతో పాటు... రెబల్ లుక్ ఇవ్వడం, ఈజీ సింబల్ కావడంతో ప్రజలు త్వరగా ఆకర్షితులవుతారు. గత రెండు దశాబ్దాలుగా ప్రతి ఎన్నికల్లో ఈ సింహం గుర్తు ప్రధాన పార్టీలతో పాటు కనిపిస్తూ వస్తుంది. అందుకే కవిత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతలతో చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ మున్సిపల్ ఎన్నికల వరకు ఫార్వర్డ్ బ్లాక్ బీ ఫార్మ్‌లతో జాగృతి అభ్యర్థులు పోటీ చేయనున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల జరుగుతున్న అన్ని మున్సిపాలిటీలోనూ జాగృతి పోటీ చేయనున్నట్లు సమాచారం. జాగృతి పార్టీ రిజిస్ట్రేషన్ కంప్లీట్ కావడానికి ఇంకొక నాలుగు ఐదు నెలల సమయం పడుతుంది. ఈనెల 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో అంత సమయం లేనందున సింహం గుర్తుతో పోటీకి దిగాలని కవిత నిర్ణయించుకున్నారు. అయితే సింహం గుర్తుతో పోటీ చేయనున్న కవిత అభ్యర్థులు ఎవరి ఓట్లను మింగేయనున్నారు అనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది. ఇది ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లను చీలుస్తుందా.. లేక అధికార పార్టీ ఓట్లను కొల్లగొడుతుంతా అనేది సస్పెన్స్‌గా మారింది. మున్సిపల్ ఎన్నికల బరిలో అటు జాగృతి అభ్యర్థులు కూడా పోటీ చేయడంతో దీనిపై ఇటు గులాబీ పార్టీలో కూడా తీవ్ర చర్చ జరుగుతుంది.

## సబ్‌రిజిస్ట్రార్ ఆస్తులు ఏకంగా రూ.100 కోట్లు

కాప్రా, ECIL, భవానీ నగర్ కాలనీ, వీధి నంబర్ 8Nలోని ట్రిప్లెక్స్ ఇండిపెండెంట్ ఇల్లు (G+2)కు సంబంధించిన పత్రాలు, ఇబ్రహీంపట్నంలోని చింతపల్లిగూడ గ్రామంలో ఒక ఓపెన్ ప్లాట్, పరిగి మండలంలోని నస్కల్ గ్రామంలో 27 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలు లభించాయి. ఇబ్రహీంపట్నంలోని మంగళ్‌పల్లి గ్రామంలో ఎకరం వాణిజ్య భూమి, పరిగి మండలంలోని నస్కల్ గ్రామంలో రూ.1.24 కోట్ల విలువైన స్విమ్మింగ్ పూల్ ఉన్న ఒక ఫామ్‌హౌస్‌ను కూడా ఎసిబి స్వాధీనం చేసుకుంది. దీనితో పాటు, సుమారు రూ.9 లక్షల నికర నగదు, సుమారు 1.2 కిలోల బరువున్న బంగారు ఆభరణాలు, ఒక ఇన్నోవా ఫార్చ్యూనర్ కారు, ఒక వోల్వో XC 60 B5 కారు, ఒక వోక్స్‌వ్యాగన్ టైగన్ GT ప్లస్ కారు కూడా స్వాధీనం చేసుకున్నారు. రెడ్డి ARK స్పిరిట్స్ అనే మద్యం వ్యాపారంలో రూ.80 లక్షలు పెట్టుబడి పెట్టారని, తన భార్య, పిల్లల పేరిట రెండు షెల్ కంపెనీలను స్థాపించారని ACB తెలిపింది. చరాస్తులు, స్థిరాస్తుల మార్కెట్ విలువ డాక్యుమెంట్ విలువ కంటే చాలా రెట్లు ఎక్కువగా ఉంటుందని అంచనా. దీంతో అవినీతి నిరోధక చట్టం, 1988 (2018లో సవరించిన ప్రకారం) సెక్షన్లు 13(1) (బి, 13 (2) కింద రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి, ఆయనను అరెస్ట్ చేశారు. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల మొత్తం విలువ రూ. 7.8 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేయగా, వాస్తవ మార్కెట్ విలువ గణనీయంగా ఎక్కువగా ఉండవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అదనపు ఆస్తులను గుర్తించడానికి కేసు దర్యాప్తులో ఉంది.

## ట్రంప్‌కు ఊహించని షాక్..!

ఒకవైపు యూరప్ రష్యాకు ఎదురు నిలుస్తూనే, మరోవైపు భారత్ నుండి శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులను కొనుగోలు చేస్తోందని అమెరికా చెబుతోంది. నిజానికి భారత్, రష్యా నుండి ముడి చమురును కొనుగోలు చేస్తుంది, దానిని దాని శుద్ధి కర్మాగారాలలో పెట్రోల్, డీజిల్‌గా మారుస్తుంది, ఆపై దానిని యూరప్‌కు విక్రయిస్తుంది. ఈ చమురును భారత శుద్ధి కర్మాగారాల నుండి కొనుగోలు చేయడం ద్వారా, యూరప్ పరోక్షంగా రష్యాకు నిధులు సమకూరుస్తోందని బెసెంట్ ఆరోపించింది. యూరప్ మద్దతు ఇవ్వకపోయినా, అమెరికా భారతదేశంపై తన ఒత్తిడిని కొనసాగించింది. అమెరికా భారతదేశంపై మొత్తం 50 శాతం సుంకాన్ని విధించింది, ఇందులో రష్యన్ చమురు కొనుగోలుపై 25 శాతం ప్రత్యేక జరిమానా కూడా ఉంది. ఈ ప్రయత్నం విజయవంతమైందని, 2025లో భారతదేశం రష్యన్ చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గుతాయని అమెరికా ట్రెజరీ కార్యదర్శి పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్, ప్రభుత్వ యాజమాన్యంలోని శుద్ధి కర్మాగారాలు రష్యా నుండి చమురు దిగుమతులను తగ్గించాయని, రష్యా చమురు కొనుగోలుదారుల జాబితాలో భారతదేశం మూడవ స్థానానికి పడిపోయిందని డేటా చూపిస్తుంది.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ జన ప్రభంజన యాత్ర

- అడుగడుగునా ప్రజల ఆశీర్వాదాలు పూల వర్షాలు
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**జయభేరి, షాద్ నగర్, జనవరి 24 :**




మున్సిపల్ ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి ల నేతృత్వంలో షాద్‌నగర్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించింది. శనివారం చౌడమ్మ గుట్ట హనుమాన్ దేవాలయంలో మున్సిపల్ ఎన్నికలకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల నగారా మోగించిన హై.ఈనెల 27న మున్సిపల్ పోరుకు నోటిఫికేషన్




వెలువబడుతుండడంతో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ యుద్ధానికి సిద్ధమయింది. ఇందులో భాగంగా ఇటీవల ఆయా వార్డుల్లో రోడ్లు డ్రైనేజీలు విద్యుత్ దీపాలు తదితర అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేపడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపల్ పోరుకు ముందు విజయ సంకేతాన్ని ప్రదర్శించారు. జనంతో ముచ్చటిస్తు.. ముందుకు సాగుతూ.. ఎమ్మెల్యే శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిలు రోడ్డుకు ఇరువైపులా ప్రజలకు అభివాదం చేస్తూ వ్యాపారస్తులను చేతిలో చేయి వేసి నమస్కరిస్తూ ముందుకు సాగారు. కాంగ్రెస్ పార్టీ జన ప్రభంజనం పేరుతో శనివారం చౌడమ్మ గుట్ట నుండి భారీ ర్యాలీని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తదితర పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాదయాత్రగా బయలుదేరి పట్టణంలో చౌరస్తా మీదుగా మెయిన్ రోడ్డు పటేల్ రోడ్డు ఇంకా అనేక ముఖ్యమైన ప్రాంతాల్లో ర్యాలీగా బయలుదేరారు. జానపద కళాకారుల డప్పుమోతలు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, తాండ్ర కాశీనాథ్ రెడ్డి, శివశంకర్ గౌడ్ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, శ్రావణి, మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ చెంది తిరుపతిరెడ్డి, రఘు నాయక్, జంగారీ రవి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, రవీందర్ రెడ్డి, గోటిక గోపాల్ రెడ్డి, జమ్రుద్ ఖాన్, అప్పి, చందు రాథోడ్, పట్టణానికి చెందిన 28 వార్డులకు సంబంధించిన ఆశావాహులు, నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు 6 మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

---


# పాతగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి అధ్యయనోత్సవాలు

- బ్రహ్మోత్సవాలను ఏర్పాట్లు పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వినోద్ రెడ్డి

**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 24:**



తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదాద్రి ఆలయ అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా తొలి రోజైన శనివారం ఉదయం ఆలయంలో నిత్యారాధనల అనంతరం తిరుమంజనంను శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. సాయంత్రం నిత్యారాధనల అనంతరం తొళక్కముతో ప్రారంభించి దివ్య ప్రబంధ సేవాకాలమును పారాయణికులు వేదోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మామూర్తి, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ జె.వినోద్‌రెడ్డితో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు అధ్యయనోత్సవాల విశిష్టతను వివరించారు.



**ఈనెల 28 నుంచి పాతగుట్ట బ్రహ్మోత్సవాలు..**

ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పాతగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు చేశారు. 28న స్వస్తివాచనంతో ప్రారంభంకానున్న ఉత్సవాలు 3వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగియనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 30న రాత్రి 7.30 గంటలకు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం, 31న రాత్రి 7.30 గంటలకు స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవం, వచ్చే నెల 1వ తేదీన రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం జరగనున్నట్లు తెలిపారు. పాతగుట్ట శ్రీ లక్ష్మి నరసింస్వామి వారి అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ జి. వినోద్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా శనివారం ప్రారంభమైన అధ్యయనోత్సవాలలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం పాతగుట్ట ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించి ఆలయ అధికారులకు పలు సూచలు చేశారు.

---



# శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా ప్రకటించాలి

- గిరిజన యువ నాయకుడు ఆకాష్ నాయక్
- శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలి

**జయభేరి, షాద్ నగర్, జనవరి 24 :**

గిరిజనుల ఆరాధ్య దైవం సమాజ సంస్కర్త మరియు ధార్మిక నాయకుడైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఫిబ్రవరి 15న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గిరిజన యువ నాయకుడు ఆకాష్ నాయక్ అన్నారు. సేవాలాల్ మహారాజ్ కేవలం బంజారాల సమాజానికే కాకుండా, మొత్తం యావత్ భారతదేశానికి ధర్మానికి ఆదర్శప్రాయాయమని పేర్కొన్నారు. అహింసను ప్రతిపాదికగా తీసుకొని హింసను పాపమని, మత్తు పదార్థాలు మరియు ధూమపానం శాపమని హెచ్చరించారు. కుల, మత వర్మ విభజనలను నిర్మూలించి సమాజంలో సమానత్వానికి కృషి చేశారు. బంజారాల పరువు ప్రతిష్టను పునర్మించారు. గిరిజనుల సంచార జీవనశైలిని స్థిరీకరించి వ్యవస్థీకృత జీవన విధానాన్ని ప్రవేశపెట్టారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు మరియు సిద్ధాంతాలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకమని, ఆయన జయంతి రోజును సెలవుదినంగా ప్రకటించాలని ఆకాష్ నాయక్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ ఉత్సవం కేవలం గిరిజనులే కాకుండా యావత్ భారత దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా, సమాజంలోని ప్రతి వర్గానికి సేవలల్ మహారాజ్ యొక్క ఆధ్యాత్మిక, సామాజిక విశిష్టతను చాటి చెప్పేందుకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

---

# నాంపల్లిలో ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం

- ఆ భవనంలో తల్లి, ఇద్దరు పిల్లలు ?....



**జయభేరి, హైదరాబాద్, జనవరి 24 :**

హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఓ ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. నాలుగు అంతస్తుల కలిగిన భవనంలోని బచ్చా క్యాజిల్ ఫర్నిచర్ షాపులో మంటలో చెలరేగాయి. స్థానికుల సమాచార మేరకు అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. మంటల్లో తల్లి, ఇద్దరు పిల్లలు చిక్కుకున్నట్టు సమాచారం. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్ని ప్రమాదం జరిగిన భవనంలోకి రోబోను పంపి అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఆ భవనంలో తల్లి, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు సమాచారం. పోలీసులు, హైడ్రా, విపత్తు, జిహెచ్‌ఎంసి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. భవనం చుట్టూ పొగ అలుముకోవడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

---

# షాద్ నగర్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

- ప్రజా పాలనలో ప్రజలందరికీ ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి షాద్ నగర్ రూపురేఖలు మారుస్తాం
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, జనవరి 24 :**



షాద్ నగర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ప్రజలంతా ప్రజా ప్రభుత్వంలో అన్ని విధాలుగా ఆనందంగా ఉన్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ మున్సిపల్ అభివృద్ధికి ఎన్ని కోట్ల నిధులైనా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మున్సిపాలిటీని అందరి సహకారంతో ఆదర్శవంతంగా తీర్చి దిద్దుకుంటామని ఎమ్మెల్యే శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి అన్నారు.

శనివారం ఈడెన్ ప్లాజా ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ; రెండు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధికి నిదర్శనంగా ఒక్క పిలుపు మేరకు గ్రామాల నుండి వేల సంఖ్యలో కార్యకర్తలు నాయకులు వచ్చారన్నారు. షాద్ నగర్ పట్టణంలో కనీవిని ఎరుగని రీతిలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ బ్రహ్మాండంగా జరిగిందన్నారు. రెండు సంవత్సరాల వ్యవధిలో 1350 కోట్ల నిధులు వచ్చాయంటే మామూలు విషయం కాదు అన్నారు. ఏడాదిలోపు అనుకున్న లక్ష్యాన్ని సాధించి షాద్నగర్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తూనే గ్రామాలతో పాటు పట్టణాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సాధించింది అన్నారు.

గత పది ఏళ్ల పాలనలో జరిగిన తప్పిదాలు ఇప్పుడు ఉండబోవన్నారు. అభివృద్ధిలో నాణ్యతతో కూడిన పనులు, అవినీతి రహిత పాలన దిశగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో 250 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ కళాశాల, అదేవిధంగా స్టేడియం ల ఏర్పాటు, పట్టణ ముఖ్య కూడలి నుండి ఆరు కోట్ల రూపాయలతో పరిగి రోడ్డు ఆరు లైన్ల విస్తరణ పనులు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతిరోజు ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధికి ఎలాంటి లోటు ఉండదని అన్నారు. స్థానిక మున్సిపల్ ఎన్నికల్లోను ప్రజలు అభివృద్ధిని కోరుకోవాలని, కాంగ్రెస్ పార్టీని దీవించి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారితో గెలిపించాలని కోరారు. తమ ప్రభుత్వం ప్రజల ఏరికోరి అనుకున్న ప్రజా ప్రభుత్వం అని తమ ఆరాటం పోరాటం అంతా కూడా షాద్ నగర్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు; కాశీనాథ్ రెడ్డి, అగ్గనూరు విశ్వం, విశాల మహమ్మద్ అలీ ఖాన్, బాబర్, కృష్ణారెడ్డి ,శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, సర్వర్ పాషా, దామోదర్ రెడ్డి, గంధ్రతి బాలరాజ్ గౌడ్, జంగా నరసింహా యాదవ్, అంగనూరు బస్వం రఘునాయక్ ,పురుషోత్తం రెడ్డి , జితేందర్ రెడ్డి, అందేమోహన్, దిలీప్ ,నాగరాజు ,శ్రావణి, ముబారక్ అలీ ఖాన్, సయ్యద్ ఖదీర్, జంగారి రవి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ,రాసుమల్లగూడ సర్పంచ్ నత్తి శివరాములు, రాయకల్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు..

---



# కిడ్నీ వ్యాధి భాధితుడు మర్రీ సతీష్ కుటుంబ సభ్యులకు

- పది వేలు రూపాయలు ఆర్థిక సాయం అందజేసిన పాపట్ల నరహరి

**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 24:**

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లికి చెందిన మర్రి సతీష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. మర్రి సతీష్ ప్రతి వారం నార్కెట్‌పల్లికి వెళ్లి డయాలసిస్ చేయించుకొని వస్తుండడాన్ని గమనించిన బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి తన ఇబ్బందిని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె ఆలేరులోని డయాలసిస్ కేంద్రానికి మర్రి సతీష్‌ను తీసుకొని వెళ్లాలని సూచించారు. అంతేకాకుండా మర్రి సతీష్‌కు బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించి అండగా నిలిచారు.

---

# చెత్తకు సరుకులు ఫ్రీ.. పరవాడలో స్వచ్ఛ రథం ప్రారంభం



**జయభేరి, పరవాడ:**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఏపీ ప్రభుత్వం ఆ కార్యక్రమం స్ఫూర్తిని పల్లెలకు సైతం విస్తరింపజేసేందుకు కొత్త ఆలోచన చేసింది. అందులో భాగంగా పరవాడలో శనివారం అధికారులు,పంచాయతీ సర్పంచ్ ఎస్ ఏ నాయుడు చేతులు మీదగా స్వచ్ఛ రథం ప్రారంభం చేసారు.వాహనం వద్ద చెత్త అందించిన వారికి ఆ చెత్తకు సమానమైన నిత్యావసర సరుకులను ఉచితంగా అందిస్తారు.ప్రజలకు ఆరోగ్యవంతమైన, సౌకర్యవంతమైన జీవనం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అరికట్టాలనే ఉద్దేశంతో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి నెల మూడో శనివారం మున్సిపాలిటీలు, పట్టణాలలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపడుతున్నారు. అయితే స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని పల్లెల్లోకి కూడా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఏపీ పంచాయతీరాజ్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ యొక్క కార్యక్రమంలో ఈఓఆర్డి మల్లికార్జునరావు, గ్రామ సెక్రెటరీ అచ్యుతరావు, తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, జనసేననాయకుడు రెడ్డి శ్రీనివాసరావు, వార్డ్ మెంబర్ పోతల అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది మరియు అధికారులు పాల్గొన్నారు.

---

# పాతగుట్ట శ్రీలక్ష్మీనృసింహుల బ్రహ్మోత్సవాలకు సకల సౌకర్యాలు

- పాతగుట్ట లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,వేద పండితుల ఆశీర్వాదం



**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 24:**

తెలంగాణ ఇలవేల్పు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీనర సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వపరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. పాతగుట్ట దేవస్థానంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవ ఆహ్వాన మహోత్సవం 2026కు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఘనంగా సత్కరించి యాదగిరిగుట్ట దేవస్థానం అందజేసింది. ఈ సందర్భంగా ఆలయ పండితులు, వేద పండితులు బీర్ల అయిలయ్యకి ప్రత్యేకంగా ఆశీర్వచనాలు అందజేసి, ప్రజాసేవలో, రాజకీయ జీవితంలో ఇంకా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, భగవంతుడి కృప ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి పాతగుట్ట బ్రహ్మోత్సవాలు భక్తుల విశ్వా సాలకు ప్రతీకగా నిలిచిన మహోత్సవమని, ఈ పర్వదినాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఆలయ అధికారులు డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్, ఏఈవో రఘు, కాంగ్రెస్ నేతలు చీర శ్రీశైలం, కానుగు బాలరాజు, గుండ్లపల్లి భరత్ గౌడ్, ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, సుడుగు జీవన్ రెడ్డి, ఎరుకల హేమేందర్ గౌడ్, కొల కృష్ణ, బంధారపు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

---

# మావోయిస్టులు లొంగుబాటు

**జయభేరి, రామగుండం :**

కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిశోర్ ఝా ఎనిమిది మంది మిలీషియా, కొరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ మావోయిస్టు ల లొంగిపోయారు. లొంగిపోయిన ఎనిమిది మంది వ్యక్తులు మిలీషియా, కొరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ వంటి విభాగాల్లో క్రియాశీలకంగా పని చేశారు. వీరు ప్రధానంగా ఛత్తీస్గఢ్ రాష్ట్రం బీజాపూర్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించారు.



## సర్పంచ్, ఉప సర్పంచ్ లను సన్మానించిన ఉపాధ్యాయులు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లి సర్పంచ్ పెద్దమోని లక్ష్మి, ఉపసర్పంచ్ కవితలను స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సిఐ భగవంత రెడ్డిని సన్మానం మించిన చందు గౌడ్



జయభేరి, దేవరకద్ర :

నారాయణపేట జిల్లా మరికల్ మండలం నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన భగవంత రెడ్డిని శనివారం దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు చందు గౌడ్ ఘనంగా సన్మానించారు. సిఐ భగవంత రెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి చందు గౌడ్ శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి సత్కరించారు.

## మన్యం కొండ బ్రహ్మోత్సవాలకు ఎంపీ కు ఆహ్వానం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మను ఆలయ చైర్మన్అళహరి మదుసుధన్ కుమార్ ఆహ్వానించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు ఎంపీడీకే అరుణమ్మను మహబూబ్ నగర్ లోని ఆమె నివాసంలో బ్రహ్మోత్సవాలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. స్వామి వారి ప్రసాదాలను కూడా దేవస్థానం చైర్మన్ తో పాటు ఆలయ సిబ్బంది అందజేసి ఆహ్వానించారు.

## జాతీయ ఓటర్ దినోత్సవం



జయభేరి, దేవరకొండ :

మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) దేవరకొండలో ఎన్ఎస్ఎస్ యూనిట్ I&II ఆధ్వర్యంలో కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులు అధ్యాపకేతరులు అందరూ ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ జి .కోటయ్య మాట్లాడుతూ ఓటు అనేది మన చేతిలో ఉండే ఒక పదునైన ఆయుధమని ఓటు సమాజ మార్పుకు సాధ్యమవుతుందని కాబట్టి నిజాయితీగా అభివృద్ధి పరులకు ఓటు వేసి సమాజాభివృద్ధిలో భాగం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ వి మకట్లాల్ కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతరులు విద్యార్థిలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బాలిక దినోత్సవం



జయభేరి, చందంపేట :

జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమములో జిల్లా పరిషత్ హై స్కూల్ చందంపేట గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు లీలా రాణి మాట్లాడుతూ భారతదేశ మహిళ తొలి ప్రధాని ఇందిరా గాంధీ ప్రమాణ స్వీకారము చేసిన జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవం గా 2008 నుండి జరుపుకుంటున్నామని అదే విధముగా భారత ప్రస్తుత ప్రధాని మోడీ భేటీ బచావో బేటి పడావో అని నినాదంతో బాలికలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని, ఇప్పటికీ బాలికల అసమానత వెట్టి చాకిరి వలన భ్రూణ హత్యలు లైంగిక వేధింపులు మొదలగు వాటితో బాధపడుతున్నారని కాబట్టి సమాజపరంగా వారికి రక్షణ కల్పిస్తూ మగవారితో సమానంగా ఆడవారు ఎందులో తీసి పోరని వారికి అవకాశాలు ఇచ్చినట్లయితే ఏ రంగంలోనైనా దూసుకెళ్తారని తెలియచేసినారు. ఈ కార్యక్రమములో ఈ కార్యక్రమములో ఎం చంద్రశేఖర్ ,గోవిందు కొండయ్య ,జోసెఫ్ చౌదరి, రామచంద్రు ,విజయ, మధు, డాక్టర్ వెంకట్, సంధ్యారాణి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు

జయభేరి, పరవాడ:

జాతీయ బాలిక దినోత్సవ సందర్భంగా శనివారం పరవాడ మండలం వెన్నెల పాలెం గ్రామంలో బాలికల చేత మంచి ఆటపాటలతో యోగ ఆసనాలతో నృత్య ప్రదర్శనతో కరాటే మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనతో చాలా ఘనంగా జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు జరిపించడం జరిగింది.




ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్డీవో షేక్ అయుష మాట్లాడుతూ బాలికలు చాలా కాన్ఫిడెంట్ గా ఉండాలని మరియు కెరీర్ గైడెన్స్ కలిగి ఉండాలని బాలికలు తమ తమ శక్తి యుక్తులు ఏమిటి తమ బలహీనతలు ఏమిటి తెలుసుకొని జీవితంలో బ్యాలెన్స్ చేసుకుంటూ మంచి గొప్ప చదువులు చదువుకొని పెద్ద ఉద్యోగాలు చేయాలని మరియు బాలికలు సెల్ఫ్ డిఫెన్స్ కలిగి ఉండాలని చెడు త్రోవల లో నడవకూడదని మంచి చెడుల మధ్య వ్యత్యాసాలు తెలిసి ఉండాలని, బాలికలు వారి భవిష్యత్తుకు వారే మంచి జ్ఞానంతో బంగారు బాటలు వేసుకోవాలని మాట్లాడారు అలాగే మరో అతిథి మహిళా కమిషన్ మెంబర్ గెడ్డం ఉమా మాట్లాడుతూ బాలికలు వారికి ఉన్న హక్కులు వాటిని పరిరక్షించుటలో గవర్నమెంట్ తీసుకునే విధి విధానాలు గురించి మరియు బాలికల చిన్నతనం నుంచే మంచి జ్ఞానాన్ని కలిగి ఉండాలని ఆ రకంగా చిన్నతనం నుంచే మంచి ప్రణాళిక చేసుకొని వారి జ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా బాలికలు పెద్దయిన తర్వాత మంచి మంచి స్థానాల్లో స్థిరపడగలరని వారు ఏ రకమైన స్థానాల్లో స్థిరపడాలనుకుంటున్నారో దానికి కావలసిన బాటలు ఇప్పటినుంచే వేసుకోవాలని మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిని ఎన్ సూర్య లక్ష్మి మాట్లాడుతూ.. బాలికలు ఆరోగ్యంగా ఉండాలని మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉన్నత చదువులు చదువుకోవాలని ఇప్పటి నుంచే తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునే లాగా కార్యాచరణ చేయాలని మాట్లాడారు బాలికలు వారు అనుకునే విధంగా గొప్ప స్థానాల్లో స్థిరపడాలంటే ముందుగా బాలికలు ఆరోగ్యం విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉండాలని మంచి న్యూట్రిషన్ కూడా తీసుకోవాలని రక్తహీనత లేకుండా చూసుకోవాలని అలాగే మంచి ఆటలు వ్యాయామం నేర్చుకోవాలని అన్ని రంగాల్లో బాలికలు తమదైన శైలిలో మంచి స్థానాన్ని సంపాదించుకోవాలని చెప్పారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించినవి లలిత సిడిపిఓ సబ్బవరం ప్రాజెక్టు వారు బాలికల హక్కుల యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య అవశ్యకత గురించి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ జయ శ్రీ, ఎంఈఓ 1 దివాకర్, ఎంఈఓ 2 శైలజ, ఏ ఏ ఏ కాన్ ఏవో ఎంపీడీవో, అనకాపల్లి టి. శశి కళ ఏసిడిపిఓ, ఏపీఎం రంగారావు, ఎమ్మార్వో అరుణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మోహినుద్దీన్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ మంజుల వన్ స్టాప్ సెంటర్ డిసిపియు సిబ్బంది, ముఖ్యనాయకులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అభయాంజనేయ స్వామి ఆలయంలో రథసప్తమి

జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పి బోనంగి పంచాయతీలో స్థానిక సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, డెక్క శ్రీనివాసరావు, బండారు బోయన్న(బుజ్జి) ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా ఈనెల 25వ తేదీ ఆదివారం శ్రీశ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద తీర్థ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో ఉదయం 5 గంటల నుండి ఆలయ ప్రధాన అర్చకులు అందుకూరి శ్రీనివాస శర్మ పంచద్రవ్య నారికేల సుగంధ సింధూర అభిషేకములు నాగవల్లి పత్ర పూజ జరుపబడునని మరియు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆలయం వద్ద మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్నసమారాధన జరుగుతుందని చుట్టుపక్కల ఉన్న గ్రామ ప్రజలు మరియు భక్తులు వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలని అలాగే సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట నృత్యాలు, తాడి పెద్దు గరిడీలు, చిటికెల భజనలతో తీర్థం ఘనంగా జరుగుతుందని తెలిపారు. స్థానిక పెద్దలు, ప్రజలు, భక్తులు తీర్థ మహొత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు ఒక ప్రకటన ద్వారా కోరారు.

## దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేట, కౌకుంట్ల, కొత్తకోట, భూత్పూర్ గ్రామాలలో ఆదివారం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 11 గంటలకు మూసాపేట మండలం కొమ్మిరెడ్డి పల్లి లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభిస్తారు. అలాగే 11:30 గంటలకు కౌకుంట్ల మండలం వెంకటగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారు. మధ్యాహ్నం 12:30 గంటలకు కొత్తకోట మండలం వడ్డేవాట గ్రామంలో, 1:30 గంటలకు భూత్కూర్ గ్రామంలో, 230 గంటలకు నాటవెల్లి పెద్ద తండా గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రారంభోత్సవాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొంటారు.కావున ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, సర్పంచ్ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, సేవదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

# హెల్త్ యూనిట్ సేవల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ రౌతు

- విశాఖ ఫార్మాసిటీ పరిసర గ్రామాలకు మొబైల్ హెల్త్ యూనిట్ సేవలు

జయభేరి, పరవాడ:

విశాఖ ఫార్మాసిటీ పరిసర ప్రాంతాలలోని గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రీసస్టైనబులిటీ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో రాంకీ ఫౌండేషన్ మొబైల్ హెల్త్ యూనిట్ను విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ సేవలు విశాఖ ఫార్మాసిటీ చుట్టుపక్కల ఉన్న మొత్తం 16 గ్రామాలలో కొనసాగుతున్నాయి.అత్యుత్తమ ప్రమాణాలతో రూపొందించిన ఈ మొబైల్ హెల్త్ యూనిట్ లో ప్రాథమిక వైద్య అవసరాలకు అనుగుణంగా ఆధునిక సదుపాయాలు కల్పించారు. ఈ వాహనంతో పాటు ఒక డాక్టర్, ఒక హెల్త్ కోఆర్డినేటర్, ఒక నర్స్, ఒక ఫార్మసిస్ట్ మరియు ఒక డ్రైవర్ కలిపి మొత్తం ఐదు మంది సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు.ఈ మొబైల్ హెల్త్ యూనిట్ ద్వారా గ్రామ ప్రజలకు ఉచిత డాక్టర్ కన్సల్టెన్సీ తో పాటు బీపీ, షుగర్ వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి నాణ్యమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. రోజుకు ఒక గ్రామంలో సుమారు నాలుగు గంటల పాటు ఈ సేవలు అందుబాటులో ఉంటున్నాయి.రీసస్టైనబులిటీ లిమిటెడ్ సామాజిక బాధ్యత నిధులతో రాంకీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాల్లోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ నివాస ప్రాంతంలోనే వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతోంది. ఈ యూనిట్ ద్వారా సుమారు 60 రకాల మందులను అవసరమైన రోగులకు ఉచితంగా అందిస్తున్నారు.అలాగే, తీవ్రమైన ఆరోగ్య సమస్యలున్న రోగులకు సంబంధిత ప్రత్యేక వైద్యుల వద్దకు వెళ్లాల్సిన అవసరాన్ని డాక్టర్ సూచించి మార్గనిర్దేశం కూడా చేస్తున్నారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ మొబైల్ మెడికల్ యూనిట్ సేవలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.




# లక్ష్మీపల్లిలో బాలికా జాతీయ దినోత్సవ వేడుకలు

- బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి
- సర్పంచ్ పెద్దమోని లక్ష్మీ ఆంజనేయులు

జయభేరి, దేవరకద్ర :

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి గ్రామ సర్పంచ్ పెద్దమోని లక్ష్మి ఆంజనేయులు పిలుపు నిచ్చారు. దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాల లో శనివారం జరిగిన జాతీయ బాలికా దినోత్సవ వేడుకలకు సర్పంచ్ పెద్దమోని లక్ష్మి ఆంజనేయులు, ఉప సర్పంచ్ కవిత లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెద్దమోని లక్ష్మి ఆంజనేయులు మాట్లాడుతూ బాలికల భవితకు విద్యా అవసరం అన్నారు. బాలికలందరూ విధిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఆడపిల్లలు చదువుకుంటేనే హక్కులు, సమానత్వం, ఆరోగ్యం పై అవగాహన కలుగుతుందన్నారు. బాలికల చదువుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. జాతీయ బాలికా సాధికారిత దినోత్సవ విశిష్టత గురించి పాఠశాల ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్ వివరించి అవగాహన కల్పించారు. అనంతరం భారత సేవాశ్రమ సంఘం సహకారంతో బాలికలకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కవిత, ప్రాథమిక పాఠశాల హెచ్ యం కల్పన, ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్ యం మురళీధర్, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, విజయ లక్ష్మి, నాగేశ్వర్ రెడ్డి, కావాలి సుజాత, గ్రామస్థులు రాజు గౌడ్, వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.



# ఉన్న గ్రామంలోనే ఉపాధి కల్పించాలన్నదే ప్రధాని లక్ష్యం

- మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ
- పర్దిపూర్ లో విగసిత్ భారత్ జి రాంజి కార్యక్రమం

జయభేరి, దేవరకద్ర :

గ్రామాలలోని ప్రజలు ఉపాధి లేక పట్టణాలకు తరలి పోతున్నారని అలా జరగకుండా ప్రజలకు ఉన్న గ్రామంలోనే ఉపాధిని కల్పించాలన్నదే ప్రధాని మోదీ ప్రధాన లక్ష్యమని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అన్న అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండల పర్దిపూర్ లో శనివారం విగసిత్ భారత్ జి రాంజీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.ఉపాధికి కొత్త గ్యారంటీ విగసిత్ భారత్ జి రాంజీ అని ఆమె అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డిలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీ డీకే అరుణమ్మ మాట్లాడుతూ ప్రజలకు ఉన్న గ్రామంలోని ఉపాధిని కల్పించాలన్న ఉద్దేశంతో ప్రధాన మంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టరని తెలిపారు. ఈ పథకంలో మొత్తం 125 రోజులు ప్రజలకు ఉపాధి దొరుకు తుందన్నారు. ఈ సందర్భంగా చిన్న చింతకుంట గ్రామం నుండి ఉద్యాల కొరకు వయా నక్కల వంపు రహదారిపై వంతెన నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో కూడా ఎంపీ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ చిన్నచింతకుంట అధ్యక్షుడు దశరథ, జిల్లా ఉపాధ్యక్షులు కురువ రమేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ పద్మజా రెడ్డి, బంద్రవల్లి సర్పంచ్ వెంకటేష్,శివకుమార్, నరేష్,శ్రీనివాసులు, వెంకటేష్, బాలరాజు, గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటి

- రోహింగ్యాలకు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులే
- సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**జయభేరి, హైదరాబాద్ :**

కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుంది. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని మంత్రి భట్టి చెబుతున్నారు. సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలి. 2014 నుండి ఇప్పటి వరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు.

తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే... గుజరాత్ ను ఎందుకు లాగుతున్నారు? సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే... ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోంది. కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమే. సింగరేణిలో దోచుకున్న సొమ్ముతోనే బీఆర్ఎస్ పార్టీని ఇన్నాళ్లు నడిపించారు. రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు.... అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా దారి మళ్లించడం పరిపాటైంది. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలే. మా భాగోతం మీరు బయటపెడితే... మీ భాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారు. మరో వారం రోజుల తరువాత సింగరేణి భాగోతాన్ని దారి మళ్లించేందుకు మరో అంశాన్ని తెరపైకి తెస్తారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతున్నారు.... విచారణకు పిలిచామని సజ్జనార్ చెబుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్, కేసీఆర్ లకు కాంగ్రెస్ ప్రభుత్వం క్లీన్ చిట్ ఇస్తోందా ? కేటీఆర్, హరీష్ సహా అందరినీ సాక్షిగా పిలిస్తే... అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరు ? ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటి ? సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లే. ఇప్పటికైనా సిట్ కు స్వేచ్ఛ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుంది.

ప్రజలను దోచుకున్నకేసులన్నీ కేసీఆర్ కుటుంబానికి లొట్టపీసు కేసుల్లాగే కన్పిస్తాయి. ఎన్ని అరాచకాలు, అవినీతి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదనే ధీమా కేసీఆర్ కుటుంబంలో ఉంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో నన్ను విచారణకు పిలిచి నా ఫోన్ ట్యాప్ అయ్యిందని, మావోయిస్టు జాబితాలో నా పేరును చేర్చారని చెప్పారు. మరి అందుకు కారకులైన వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? కాంగ్రెస్ స్కాంలు బయటపడుతున్నప్పుడల్లా ఫోన్ ట్యాపింగ్ కేసుతో డ్రామాలాడుతున్నారని అన్నారు. కేటీఆర్ పెద్ద సంసారి అయినట్లు మాట్లాడుతున్నారు. ఎన్ని కుటుంబాలను, ఎంత మంది జీవితాలను నాశనం చేశారో తెలియదా? నిజాం అరాచకాలను మరువలేదు... నీ అరాచకాలను కూడా మర్చిపోలేం. కేటీఆర్ లో ఇంకా అహంకారం తగ్గలేదు.

ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ నా చాలెంజ్ కు సిద్ధమా? దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా? మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతోపాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నెంబర్లను చేర్చింది నిజం కాదా? ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా? ఇంకా సిగ్గులేకుండా దేశ భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతారా? నేను సవాల్ విసిరితే లీగల్ నోటీసులంటూ డ్రామాలాడతారు. పోనీ ఆ లీగల్ నోటీసులకైనా కట్టుబడి ముందుకు సాగుతారా? అంటే... మధ్యలోనే పారిపోతారు. 2014కు ముందే రోహింగ్యాలు పాతబస్తీలోకి అక్రమంగా ప్రవేశించారు. రోహింగ్యాలు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులే. బీఆర్ఎస్ పాలనలో నాటి హోంమంత్రి రోహింగ్యాలకు ఇండ్లు మంజూరు చేసి రోహింగ్యాలకు మద్దతిస్తున్నారు.


రాష్ట్ర పాలకులే ఓటు బ్యాంకు కోసం రోహింగ్యాలకు వంతపాడుతుంటే... శాంతిభద్రతలను కాపాడేదెవరు? సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దు. సింగరేణి అవకతవకలకు సంబంధించిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలి. లేనిపక్షంలో ఆ రికార్డులన్నీ తారుమారు చేసే ప్రమాదముంది. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని అన్నారు.

# ప్రవీణ్ కుమార్ యూ టర్న్

**జయభేరి, హైదరాబాద్, జనవరి 24 :**



ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణాధికారిగా ఉన్న సజ్జనార్‌పై తాను చేసిన వ్యాఖ్యలకు సంబంధించి పోలీసులు నోటీసులు జారీ చేయడంపై ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్పందించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలకు మద్దతుగా ప్రెస్ మీట్ పెట్టిన 12 గంటల వ్యవధిలోనే, అర్ధరాత్రి తన ఇంటికి వచ్చి పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని ఆయన తప్పుబట్టారు. కేటీఆర్, హరీష్ రావు వంటి నాయకులను విచారణ పేరిట వేధిస్తున్న తీరును ప్రశ్నించినందుకే ప్రభుత్వం తనపైకి పోలీసులను పంపిందని ఆయన ఆరోపించారు. బెదిరింపులకు తాను భయపడబోనని, తన వద్ద ఉన్న సమాచారంతోనే నోటీసులకు సమాధానం ఇస్తానని స్పష్టం చేశారుప్రవీణ్ కుమార్ తన వివరణలో ప్రధానంగా నైతికత అంశాన్ని తెరపైకి తెచ్చారు. గతంలో ఓటుకు నోటు కేసు సమయంలో తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం ఆంధ్రప్రదేశ్ నేతల ఫోన్లను ట్యాప్ చేసిందంటూ 2015లో ఏపీలో పలు కేసులు నమోదయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఆ సమయంలో సజ్జనార్ ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక అధికారిగా ఉన్నందున, ఇప్పుడు అదే ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఏర్పాటైన సిట్‌కు ఆయన నేతృత్వం వహించడం నైతికంగా సరికాదని తాను అభిప్రాయపడినట్లు తెలిపారు. నోటీసులో పేర్కొన్నట్లుగా తాను సజ్జనార్‌పై కేసులు ఉన్నాయని అనలేదని, గతంలోని కేసుల కారణంగా ఆయన విచారణాధికారిగా ఉండటాన్ని మాత్రమే ప్రశ్నించానని సమర్థించుకున్నారుఫోన్ ట్యాపింగ్ అనేది దేశ రక్షణ, వ్యవస్థీకృత నేరాల నియంత్రణ కోసం చట్టబద్ధంగా జరిగే ప్రక్రియ అని, దీనిపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ వాదించారు. గతంలో యూపీఏ ప్రభుత్వం, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గతంలో ట్యాపింగ్ గురించి చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. కేవలం రాజకీయ ప్రతీకారంతోనే బీఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెడుతున్నారని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలపై గొంతెత్తడం తన రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఆయన ఉద్ఘాటించారు. తన వ్యాఖ్యలు ఏ అధికారి లేదా రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి ఉద్దేశించినవి కావని ఆయన క్లారిటీ ఇచ్చారు. బహిరంగంగా సజ్జనార్‌పై తీవ్ర విమర్శలు చేసి, తీరా నోటీసులు అందగానే తాను అలా అనలేదు అని వివరణ ఇచ్చుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సజ్జనార్ ఇచ్చిన రెండు రోజుల గడువులోగా ప్రవీణ్ కుమార్ సమర్పించే సమాచారం ఏ విధంగా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆ సమాచారం పోలీసులను సంతృప్తి పరచకపోతే, ఆయనపై సివిల్ , క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పరిణామాలతో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ఇప్పుడు అధికారులకు మరియు రాజకీయ నేతలకు మధ్య సవాలుగా మారింది.



## నిరాడంబర వివాహం

**జయభేరి, యాదాద్రి భువనగిరి :**

చౌటుప్పల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల ఆదర్శ వివాహం జరిగింది. చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెంకి చెందిన యువ ఐపీఎస్ అధికారిణి శేషాద్రిని రెడ్డి, కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి శనివారం ఎలాంటి అడంబరం లేకుండా రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. వధువు శేషాద్రిని రెడ్డి కుత్బుల్లాపూర్ డీసీపీ గా పని చేస్తుండగా వరుడు శ్రీకాంత్ రెడ్డి ఐఏఎస్ ట్రైనింగ్ లో ఉన్నారు. పలువురు ఉన్నత అధికారులు వివాహానికి హాజరైయారు.

## చెన్నపార్య శతకం

తే.గీ. కవిని ఆనాడె గాంచినాడు
ఛందమును నేర్ప అప్పుడే చక్కగాను
బాలకవిగాను పేరును బడసినారు
చిత్స్వరూపు గొలిచెడి చెన్నపార్య!

ఆ.వె. అన్నలిద్దరైరి చిన్నవారలు మీరు
అక్కలు నలుగురును ఏమితమైన
ప్రేమను జూపినారు పెద్ద మనసుతోడ
చిత్స్వరూపు గొలుచు చెన్నపార్య!

ఆ.వె. పేదరికములోను ప్రేమతో చదివియు
ఉన్నంతంపు పదవి నున్నవారు
ఎదిగినారు మీరలీశ్వరు కృప చేత
చిత్స్వరూపు గొలుచు చెన్నపార్య!

తే.గీ. ఆంధ్ర సారస్వత పరిషత్ నందు జేరి
తెలుగు పండితులుగ మీరు తేజరిల్లి
బయట సంస్కృత విద్యనే బడసినారు
చిత్స్వరూపు గొలిచెడి చెన్నపార్య!

ఆ.వె. పాత పట్నమందు పండిత శ్రేష్టులు
గుండె రావుగారు గురువులైరి
వృద్ధుడైన యతడు విద్యను మీకును నేర్ప
చిత్స్వరూపు గొలుచు చెన్నపార్య!



జక్కని వేంకటరాజం
సిరిసిల్ల. 94400 21734

# సింగరేణి టెండర్లపై విచారణ

**జయభేరి, హైదరాబాద్, జనవరి 24**



తెలంగాణకు ఆత్మగా భావించే సింగరేణి ప్రతిష్టను దెబ్బ తీసేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. జరుగుతున్న వివాదంతోపాటు 12 ఏళ్లలో జరిగిన పరిణామాలపై కూడా విచారణకు తాము సిద్ధమని అన్నారు. ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని కోల్పోయేలా ప్రవర్తించవద్దని ఆయన సూచించారు. సృజన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సంబంధమని ప్రశ్నించారు. ఆ వ్యక్తి బీఆర్ఎస్ పార్టీకి చెందిన కుటుంబానికి దగ్గరి బంధువు అని చెప్పారు. ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో చాలా అంశాలను మల్లు భట్టి విక్రమార్క వివరించారు. సింగరేణి టెండర్ల ప్రక్రియలో సైట్ విజిట్ అనే అంశంపై ఎక్కువ వివాదం చేస్తున్నారని కేంద్రం కూడా చాలా టెండర్లకు ఈ నిబంధన అమలు చేస్తోందని భట్టివిక్రమార్క గుర్తు చేశారు. దీని ఆధారంగానే తప్పుడు కథనాలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. 2018, 2021లో కోల్ ఇండియా పంపిన డాక్యుమెంట్‌లో సైట్ విజిట్ అనే పదాన్ని చేర్చిందని తెలిపారు.

అప్పుడు తమ ప్రభుత్వ అధికారంలో లేదు కదా అని ప్రశ్నించారు. గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లు, 'రైట్స్' టెండర్లు, హిందుస్థాన్ కాపర్స్ సంస్థ టెండర్లు ఇలా చాలా వాటిలో సైట్ విజిట్ రూల్ ఉంచినట్టు వివరాలు బయపెట్టారు. ఇలాంటివన్నీ తెలుసుకొని మాట్లాడి ఉంటే బాగుండేదని సలహా ఇచ్చారు. అక్కడ ప్రభుత్వం చేయడానికి ఏం ఉండదని, సింగరేణి అనేది అటానమస్ బాడీ అనే విషయాన్ని మర్చి పోతున్నారని అన్నారు.

సింగరేణి నిర్ణయాలు మంత్రి వద్దకు రావని చెప్పారు. అయినా సరే తమపై ఆరోపణలు వచ్చినందున వెంటనే వాటిని రద్దు చేస్తున్నట్టు ఆదేశించినట్టు వెల్లడించారు. దీని ఆధారంగానే రాద్దాంతం చేస్తున్నారని కేంద్రానికి లేఖలు రాస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. హరీష్‌రావుకు దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వానికి రాసి ఉంటే విచారణకు ఆదేశించేవాళ్లమని చెప్పారు. ఇప్పటికైనా హరీష్‌రావు లేఖ రాస్తే ముఖ్యమంత్రి వచ్చిన వెంటనే గత 12 ఏళ్ల నుంచి జరిగిన టెండర్ల ప్రక్రియపై విచారణ జరిపిస్తామని తెలిపారు. దీనికి సిద్ధమైతే ఆ మేరకు హరీష్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి అంగీకరిస్తూ లేఖ రాయాలని సవాల్ చేశారు. ఇప్పుడు కేంద్రం కూడా విచారణ జరుపుతుండటం ఆహ్వానించదగ్గ పరిణామమని అన్నారు.



## అంత్యక్రియలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

హైదరాబాద్ లో శనివారం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన ప్రొఫెసర్ బత్తిని కాంతరెడ్డి అంత్యక్రియలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ పార్థివ దేహం పై పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బైక్‌ల చోరీ నిందితుల రిమాండ్




**జయభేరి, మేడ్చల్ :**

గత కొంతకాలంగా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను మేడ్చల్ పోలీసులు రిమాండ్ కు తరలించారు. మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మేడ్చల్ కెఎల్ఆర్ వెంచర్ లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా ఇద్దరు మేడ్చల్, నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలు చేసి ఇతర రాష్టలకు అమ్ముకుంటున్నట్లు తెలిపారు. ఈ ఇద్దరు 18 బైక్ లను చోరీ చేసినట్లుగా విచారణలో తేలిందని, నేరస్తులు అశోక్, సల్మాన్ అనే ఇద్దరు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ పోలీస్ స్టేషన్లో పాత నేరస్తులని గతంలో అశోక్ పై హత్య కేసు, సల్మాన్ పై దొంగతల కేసులు ఉన్నాయని ఏసీపీ శంకర్ రెడ్డి తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ సత్యనారాయణ, డిఐ కిరణ్ కుమార్, ఎస్సై నవీన్ లను ఏసీపీ శంకర్ రెడ్డి అభినందించారు.

## అంగన్వాడి చిన్నారులకు యూనిఫాం పంపిణీ



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 24 :**

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు యూనిఫామ్ ను సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ పంపిణీ చేశారు. అనంతరం చిన్న పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగనవాడి విద్యార్థులకు నాణ్యమైన విద్య తో పాటు, పౌష్టికాహారం అందిస్తుందని, అందజేసిన దుస్తులు విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యార్థులు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి వచ్చి మంచిగా చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉదయ్ రెడ్డి, వార్డు సభ్యులు కొడపాక అక్షిత, నారా నాగరాజు, అనిల్, పంచాయతీ కార్యదర్శి ధార మహేందర్, అంగన్వాడీ టీచర్ నారా స్వప్న, వనజ, పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బాలికల దినోత్సవం




**జయభేరి, తుర్కపల్లి, జనవరి 24 :**

తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మంజుషారాణి మాట్లాడుతూ విద్య యొక్క ప్రాముఖ్యత, లింగ వివక్షత చూడవద్దని తెలిపారు. నేటి బాలికలే రేపటి మహిళలని మంచి పౌష్టిక ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండి మంచి ఉన్నత చదువులు చదవాలని సమాజంలో పురుషులతో మహిళలు సమానంగా పోటీ తత్వంలో ముందుకెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు బద్దు నాయక్, ఉపసర్పంచ్ సుమన్ నాయక్ వార్డు సభ్యులు నరేష్, రజిత, రమ్య, ఆర్ బి ఎస్ కే మెడికల్ ఆఫీసర్ కవిత, ఆప్తమాలజిస్ట్ గాయత్రి, కానిస్టేబుల్స్ ప్రతిభ, నరసింహ, ఎస్ఓ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా పెన్షనర్లకు ఆటల పోటీలు

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ యందు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మహిళలకు కుర్చీ అట, చెంచా గోలి అట, ఫాస్ట్ వాక్ ఆటల పోటీలు నిర్వహించడం జరిగినది. మహిళా పెన్షనర్లు చాలా ఉత్సహంతో పోటీలలో పాలుగోన్నారు. పురుషులకు ఫాస్ట్ వాక్, క్యారం బోర్డు, సింగిల్, డబుల్ పోటీలు నిర్వహించడం జరుగు తుంది అని అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ, కార్యదర్శి అంకం చంద్రమౌళి ఆటల కమిటీ పెద్దలు తెలియజేసినారు.కోశాధికారి మా సభ్యులు అన్ని ఆటలలో పాలుగొనడం సంతోషం కల్పించింది అన్నారు. ఆటల కమిటీ పెద్దలు కంచర్ల నారాయణ రెడ్డి, మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, గంగిడి దామోదర్ రెడ్డి, ఆకులపల్లి ఐజాక్,మాట్లాడుతూ విజేతలకు గణతంత్ర దినోత్సవం నాడు బహుమతి ప్రధానం చేయబడుతుంది అన్నారు సహా అధ్యక్షురాలు పడమటి శాంతకుమారి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, గందం వసంత ముసిని వీరయ్య, కార్యవర్గం, కార్యవర్గ సభ్యులు,సభ్యులు పాల్గొన్నారు.



## ప్రాణ సంకటంగా మారిన ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్?

జయభేరి,కుత్బుల్లాపూర్ :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం మెయిన్ రోడ్ షాపూర్ నగర్ నుండి నర్సాపూర్ హైవే నిత్యం లక్షల వాహనాలు ప్రయాణిచే రహ దారిలో ఆటంకం కలిగిస్తున్న ఈ ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్ని ప్రకకు తొలగ్గించాలని జీడిమెట్ల ఏ ఈ.,వీరేశం కి డి ఈ శ్రీనివాస్ కి, స్థానిక కార్పొరేటర్ కు, సామాజిక, పర్యవరణ ప్రేమికుడు, కొలరవీందరుముదిరాజ్, పలుమార్లు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దీనిపై ఎలాంటి చెర్యలు తీసుకోకపోవడం పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని గతంలో దీనికి ఒక లారీ కూడా తగిలిందని, మొన్న మొన్న ఒక బస్ కుడా ప్రమాదానికి గురైనాదని చెబుతున్నారు. ఏ ఈ, డి సి దృష్టికి తీసుకెళ్లాగా త్వరలోనే దాన్ని పైకి, ప్రక్కకు, మార్చే విధంగా ఆలోచన చేస్తానని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. కొలరవీందరుముదిరాజ్ మాట్లాలాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ సమస్య పై వినతి పత్రాలు ఈ స్తూనే వున్నాను ఈ ప్పటికీ చేస్తాము అని మాటఇయవడం జరిగింది అని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానికులు కృష్ణారెడ్డి,రాజు హుస్సేన్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు,

## సోలార్ పెన్సింగ్ తో పంటలకు రక్షణ




జయభేరి, తుర్కపల్లి, జనవరి 24:

సోలార్ ఫెన్సింగ్ తో పంటలకు రక్షణ కలుగుతుందని పిలుపు సంస్థ వ్యవస్థాపకులు ఎం జనార్ధన్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అడవి జంతువులు రైతుల పాలిట పెద్ద శాపముల మారిందని, దాంతో పలు పంటల విధానమే మారిపోయి రైతులంతా వరి పంటకు మారిపోవడంతో ఇతర పంటలన్నీ కనుమరుగయ్యాయని అన్నారు. ప్రధానంగా పంటల రక్షణకై సోలార్ ఫెన్సింగ్ పై ఆసక్తి చూపిన రైతులకు నాబార్డ్ ద్వారా నాలుగు ఐ రేడియోస్, ఆర్డీఎస్ ద్వారా 20, ఏఐడీ ద్వారా 6, మొత్తం 11 గ్రామాల నుండి 30 మంది రైతులకు పై సమస్త నుండి ఆరు లక్షల సహాయం అందించగా రైతులు మూడు లక్షల 20 వేలు భరిస్తున్నారని అన్నారు. రైతులందరికీ సాంకేతిక నిపుణులతో సోలార్ ఫెన్సింగ్ పై అవగాహన కల్పించినట్లు ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పిలుపు సంస్థ చారువతో నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఎస్ సంస్థ ప్రతినిధులు నవీన్, కొండల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణ, బుక్ కీపర్లు విజయలక్ష్మి, స్వప్న, 30 మంది రైతులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాకు మూడు బహుమతులు

- దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొడపాక కు భౌతిక రసాయన శాస్త్రంలో ప్రథమ బహుమతి.. డి ఈ ఓ విజయ



జయభేరి, హైదరాబాద్ :

మెదక్ జిల్లాకు మూడు బహుమతులు వచ్చినట్లు విద్యాశాఖ అధికారి విజయ తెలిపారు. దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన వివరాలకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారినీ విజయ మాట్లాడుతూ.. ఈనెల 19 నుండి 23 వరకు సంగారెడ్డి జిల్లాలోని గాడియమ్ స్కూల్ కొల్లూరులో నిర్వహించిన దక్షిణ భారతస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుండి పాల్గొనిన టీచర్ ఎగ్జిబిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొడపాక భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయులు వెంకటరమణ మొదటి స్థానం పొందడం జరిగిందని గీత స్కూల్ తూప్రాన్ విద్యార్థిని మహతి మూడవ స్థానం, సిద్ధార్థ రూరల్ హై స్కూల్ విద్యార్థి అక్షయ్ నాలుగో స్థానంలో నిలవగా రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా బహుమతులను పొందడం గర్వించదగ్గ విషయంగా కొని ఆడారు. విజేతలను కలెక్టర్ రాహుల్, అదనపు కలెక్టర్ నగేష్ అభినందించారని తెలిపారు.

## సీపీఆర్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ఛీఫ్

జయభేరి, హైదరాబాద్ :

గుండెపోటుతో ప్రాణాపాయంలో ఉన్న వారికి సకాలంలో సీపీఆర్ చేయడం వల్ల వారికి పునర్జన్మం అందించినట్లు అవుతుందని టీపీసీసీ చీఫ్ , ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతిఒక్కరు సీపీఆర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెక్రెటేరియట్ ముందు సీపీఆర్ శిక్షణ ప్రారంభోత్సవ కార్యాలయంలో మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తో కలిసి మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...రాష్ట్రంలో 2 లక్షల మందికి ఈ సీపీఆర్ పై శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని తలపెట్టిన ఫౌండేషన్ చైర్పర్సన్ కంజర్ల విజయలక్ష్మిని అభినందించారు. ప్రతి గ్రామానికి ఒక సీపీఆర్ అంబాసిడర్ ను తయారు చేసి , గుండె పోటు మరణాలను తగ్గించాలని ఆకాంక్షించారు. అజారుద్దీన్ మాట్లాడుతూ... ఇటీవల గుండె పోటుతో మరణించే వారి సంఖ్య పెరగడం బాధాకరం అని అన్నారు. ప్రతిఒక్కరు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలని సూచించారు. సీపీఆర్ నేర్చుకోవడం వల్ల ఒకరి ప్రాణాలను కాపాడే అవకాశం దక్కుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతం కావాలని అజారుద్దీన్ ఆకాంక్షించారు.

# శ్రీరస్తు శుభమస్తు.... భాజా భజంత్రీలు మోగే వేళ...

- 2026 పెళ్లి ముహూర్తాలు ఇవే...

జయభేరి,కమాన్ పూర్ :

ఈ 2026 సంవత్సరంలో పెళ్లి ముహూర్తాలు నికరమయ్యాయి. కొత్త సంవత్సరం వచ్చింది. పెళ్లి కానివారంతా పెళ్లి ప్రయత్నాలు మొదలుపెడతారు. ఇంట్లో పెద్దలు కూడా పెళ్లీడు వచ్చిన పిల్లలకు సంబంధాలు చూడటం మొదలుపెడతారు. మరికొందరు కొంత ముందుగా నిశ్చితార్థాలు పెట్టుకున్నవారుంటారు. వారంతా కొంత సమయం తీసుకొని పెళ్లి చేసుకుందామనుకుంటారు. అందుకు తగినట్లుగా 2026 సంవత్సరం మొత్తం మంచి పెళ్లి ముహూర్తాలు ఎన్ని ఉన్నాయి? జ్యోతిష్యం ప్రకారం గురువు, శుక్రుడు ముహూర్తాలకు కారకులు. ఈ రెండు సూర్యుడితో కలుస్తుండటంతో మౌఢ్యమి అవుతుంది. జనవరిలో





ముహూర్తాలు లేవు. ఫిబ్రవరి 14 తర్వాతే ముహూర్తాలు ప్రారంభమవుతాయి. అదే నెల 19 నుంచి మంచి ముహూర్తాలున్నాయి. సాధారణంగా మూఢమి ఉందని చాలామంది ఎటువంటి పనులు 14వ తేదీ వరకు తలపెట్టారు. వివాహ ముహూర్తాలు కూడా ఇంతే ఉన్నాయి.

ఫిబ్రవరి నెలలో 19, 20, 21,22, 24, 25, 26 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి.

మార్చి నెలలో 4, 5, 6, 7, 8, 11, 12, 13, 14, 20, 21, 25, 29 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి అని వేద పండితులు తెలిపారు. ఏప్రిల్ నెలలో 1,2, 3,4,5,6,7,8, 10,11,12,26,28,29,30 తేదీల్లో మంచి ముహూర్తాలు అలాగే.. మే నెలలో 1, 3,5,6,7,8,9,10,12,13 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. అధిక జ్యేష్ఠ మాసం కారణంగా మే 18 నుంచి జూన్ 11 వరకు ముహూర్తాలు లేవని గమనించాలి. జూన్ 19,20,21,24,25,27,28 తేదీల్లో ముహూర్తాలు అలాగే జూలై 1,2,3,4,5,8,9 తేదీన వివాహ ముహూర్తాలున్నాయి. ఆగష్టు నెలలో 16,18,20,21,22,23,24,25,26,27,28,30 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. సెప్టెంబర్ నెలలో 1,3,4,5 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. అక్టోబర్ నెలలో 11,14,29,30. నవంబర్ కార్తీక మాసంలో 11,13,14,18,19,20,21,22,24,25,26 తేదీల్లో డిసెంబర్ 2, 3, 10, 12, 13,15,16,17, 18,19,22,23, 27,29,31 ముహూర్తాలు ముహూర్తాలున్నాయని పండితులు తెలియజేస్తున్నారు.




రేగొండ మండలం జూబ్లీ నగర్ గ్రామంలో నివసించి మన గ్రామ ప్రజల అందరి మధ్యలో స్నేహితుల ఒక బంధువుల మన జూబ్లీ నగర్ ప్రజలందరికీ తన వంతు సహాయం చేసి ఈరెల్లి లింగయ్య అకాల మరణం చెందడం జరిగింది. వారి కుటుంబానికి బత్తుల లింగయ్య వారి కుమారుడు బత్తుల శ్రీధర్ తమ వంతు సహాయంగా వారికి ఉన్నంతలో వారు సహాయం చేయడం జరిగింది. అలాగే మన గ్రామ పెద్దలు యాకూబ్ రెడ్డి, గూడ తిరుపతి, నారాయణపురం గ్రామ పెద్ద తిరుపతి రావు వారి వంతు సాయం కూడా చేశారు.

జయభేరి, రేగొండ

## మోండా మార్కెట్ బంగారం దుకాణంలో చోరీ



జయభేరి, సికింద్రాబాద్ :

సికింద్రాబాద్ మోండ మార్కెట్ లో బంగారు షాపు తాళలు పగలగోట్టి అందులో తయారు చెసి ఉన్న అభరణలు ఎత్తుకేళ్ళారు.. మార్కెట్ పోలీస్టేషణ్ పరిధిలని జర్గీష్ షాపులో బంగారు అభరణలను తయారు చెస్తుంటారు.అయితే ఉదయం షాపు షెట్టర్ తాళం పగలగోట్టి ఉండగా..లోపలికి వెళ్లి చు సే సారికి తయారు చెసి ఉన్న పదహరు తులాల బంగారు అభరణలు కనిపించలేదు..బెంగాళ్ తో పాటు ఇతర ప్రాంతల నుంచి వచ్చిన బంగారు కార్మికులు ఈ షాపులో పనిచెస్తుండగా..ఇది తెలిసిన వారి పనే కావచ్చు అంటూ పోలీసులు అవమనిస్తున్నారు.సీసీ విడియోల ను పరిశీలించిన పోలీసులు ఓ యువకుడు బ్యాగుతో వెళ్లిపోతున్న దృష్ట్యలు కనిపించగా..అతని కోసం గాలిస్తున్నారు.

## ముస్లిం గ్రేవ్‌యార్డ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు వినతిపత్రం

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇర్షాద్ ఖాన్

జయభేరి,ఉప్పల్ :



ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్ ముస్లిం గ్రేవ్‌యార్డ్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) కోరారు. ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో షాబ్ఇబరాత్ జాగారం నిర్వహించే సందర్భంగా, ఉప్పల్ గ్రేవ్‌యార్డ్‌లో తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డిని, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ జి. రాజుని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, ఉప్పల్ స్మశాన వాటికలో రాత్రి వేళల్లో తాత్కాలిక విద్యుత్ దీపాలు, ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై పరమేశ్వర్ రెడ్డి గారు సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ సోదరులు పరమేశ్వర్ రెడ్డికి, డిప్యూటీ కమిషనర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొహసిన్, అన్వార్, ఫేసి, నూర్, ఇబ్రహీం, ఆసిఫ్, వాహీద్ తదితర బీరప్పగడ్డ ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఈఓ

జయభేరి, హైదరాబాద్ :

పాపన్నపేట మండలం కొడపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా డి ఈ ఓ తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడారు సేలబస్ ఎంత వరకు అయింది? ఎలా చదువుతున్నారు? హాజరు ఎలా ఉంది ? అని అడిగారు.సోషల్ మీడియా కు దూరంగా ఉండి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా డిఈఓ మాట్లాడుతూ.. పదవ తరగతి లో 100% శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పై స్పెషల్ ఫోకస్ పెట్టాలని, విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనకబడి ఉన్నారో తెలుసుకొని వారి పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండవీటి ఆరోగ్యం పాఠశాలలోని పరిస్థితులు



అవసరాలు సబ్జెక్ట్స్ వారిగా వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.


కొడపాక గ్రామం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాపన్నపేట మండలం మెదక్ జిల్లా పదవతరగతిలో 100 % శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ఆదర్శంగా నిలవాలని మెదక్ జిల్లా డిఈఓ తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ లు విద్యార్థులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## 'మన శంకరవరప్రసాద్ గారు' కలెక్షన్లపై దుష్ప్రచారం..

మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకరవరప్రసాద్ గారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇప్పటికే ఈ మెగా మూవీకి రూ. 300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు వచ్చినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అలాగే బుక్ మై షోలనూ 25 మిలియన్ టికెట్లు అమ్ముడుపోయినట్లు ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. అయితే కొందరు మాత్రం మన శంకరవరప్రసాద్ గారు మూవీకి ఫేక్ కలెక్షన్స్ అంటూ నెట్టింట ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ విషయంపై డైరెక్టర్ అనిల్ రావిపూడి స్పందించారు. ఈ సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' తో పాటు చాలా సినిమాలు థియేటర్స్‌లోకి వచ్చాయి. అయితే, తాము చాలా ఓపెన్‌గానే కలెక్షన్స్ వివరాలు ఎప్పటికప్పుడు ప్రకటిస్తూనే ఉన్నాం. వాటిని కొందరు మీడియా మిత్రులు కూడా షేర్ చేస్తూనే ఉన్నారు. అందులో ఎలాంటి దాపరికం లేదు. ఫేక్ కలెక్షన్స్ వివరాలు చెప్పాల్సిన అవసరం మాకు లేదు' 'ప్రేక్షకులు మెగాస్టార్ ను ఎలా చూడాలని అనుకున్నారో అంతే రేంజ్‌లో మేము తెరపై ఆయన కనిపించేలా జాగ్రత్త పడ్డాం. ముఖ్యంగా చిరంజీవి ఫ్యాన్స్ ఎక్కడెక్కడో ఉన్నవారంతా థియేటర్‌కు వచ్చేశారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ సినిమా చూసి ఎంజాయ్ చేశారు. అందుకే బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ పెరిగాయి. కేవలం వారంలోనే ఈ సినిమా బ్రేక్ ఈవెన్ అయిపోయింది. నిర్మాతలతో పాటు డిస్ట్రిబ్యూటర్స్, థియేటర్స్ యజమానులకు కూడా భారీ లాభాలు వచ్చేశాయి' అని అనిల్ రావిపూడి పేర్కొన్నారు. కాగా ఆదివారం మన శంకర వరప్రసాద్ గారు మూవీ సక్సెస్ మీట్ జరగనుంది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవితో పాటు చిత్ర బృందమంతా పాల్గొంటుంది.

## 'వీడీ 14' టైటిల్ అనౌన్స్‌మెంట్ ఆరోజే!



అగ్ర హీరో విజయ్ దేవరకొండ ఈ ఏడాది రెండు భారీ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. రవికిరణ్ కోలా దర్శకత్వంలో రూపొందుతున్న 'రౌడీ జనార్దన' చిత్రీకరణ జరుపుకుంటున్నది. కోనసీమ నేపథ్యంలో సాగే రూరల్ యాక్షన్ డ్రామా ఇది. దీనితో పాటు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా పీరియాడిక్ మూవీ షూటింగ్‌లో విజయ్ దేవరకొండ పాల్గొంటున్నారు. 'వీడీ14' అనే వర్కింగ్ టైటిల్‌తో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. 19 శతాబ్దం నాటి బ్రిటీష్ ఇండియా నేపథ్యంలో సాగే ఈ కథలో విజయ్ దేవరకొండ పాత్ర నవ్యరీతిలో ఉంటుందని చెబుతున్నారు. రాయలసీమ బ్యాక్‌గ్రౌండ్‌లో సాగే ఈ కథ కోసం విజయ్ దేవరకొండ అక్కడి యాసలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. గత ఏడాది విడుదల చేసిన గ్లింప్స్ కథపై ఆసక్తిని పెంచింది. తాజా సమాచారం ప్రకారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న సినిమా టైటిల్‌ను ప్రకటించబోతున్నట్లు మేకర్స్ సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు. ఈ పీరియాడిక్ డ్రామా టైటిల్ ఏమిటోనని అభిమానులు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు. మొత్తంగా ఈ సంవత్సరం రెండు భారీ పీరియాడిక్ సినిమాలతో విజయ్ దేవరకొండ బాక్సాఫీస్ వద్ద అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 'వీడీ14' దసరాకు, 'రౌడీ జనార్దన' డిసెంబర్ నెలాఖరులో రిలీజ్ అయ్యే అవకాశం ఉందని సమాచారం.



## సూపర్ నాచురల్ కథలో 'నాగిన్'..


బాలీవుడ్ అగ్ర కథానాయిక శ్రద్ధా కపూర్ ఈ ఏడాది భారీ సినిమాల్లో భాగమవుతున్నది. ప్రస్తుతం ఆమె మరాఠీ నృత్యకారిణి, గాయని వితాబాయి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న 'ఈఠా' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'ఛావా' ఫేమ్ లక్ష్మణ్ ఊటేకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే ఆమె 'నాగిన్' అనే సూపర్ నాచురల్ ఫిల్మ్‌లో నటించబోతున్నది. ఐదేళ్ల క్రితమే ఈ సినిమాకు బీజం పడింది. అయితే అనివార్య కారణాల వల్ల సెట్స్‌పైకి రాలేదు. తాజా సమాచారం ప్రకారం ఏప్రిల్‌లో ఈ సినిమా షూటింగ్ మొదలుకానుందని తెలిసింది. ఇందులో శ్రద్ధాకపూర్ నాగిని పాత్రలో కనిపించనుంది. భారీ గ్రాఫిక్స్ హంగులతో రూపొందే ఈ చిత్రంలో ఐకానిక్ నాగిని పాత్రను సరికొత్త పంథాలో ఆవిష్కరించబోతున్నట్లు తెలిసింది.

## తమన్నా ఫుల్.. అయినా 6 నిమిషాలకు 6 కోట్లు..



వరుస విజయాలను అందుకుని స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. సౌత్ టూ నార్త్.. అన్ని వర్గాల ప్రేక్షకులను తన నటనతో మెప్పించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా సినీరంగంలో చక్రం తిప్పుతున్న ఈ ముద్దుగుమ్మకు.. ఇప్పుడు మెయిన్ హీరోయిన్ లీడ్ రోల్ ఆఫర్స్ తగ్గిపోయాయి. చాలా కాలంగా ఆమె కేవలం స్పెషల్ పాటలతోనే నెట్టుకొస్తుంది. అటు హిందీలో మాత్రం ఈ అమ్మడు డిమాండ్ వేరేలెవల్ లో ఉంది. ఇటీవలి కాలంలో స్పెషల్ సాంగ్స్ చేస్తూ తనదైన మార్క్ క్రియేట్ చేసుకుంది. జైలర్ సినిమాలో కావాలయ్యా పాటతో మరింత పాపులర్ అయ్యింది. కొన్ని రోజుల క్రితం హిందీలో ఆజ్ కీ రాత్ అనే పాటతో మరింత రచ్చ చేసింది. ఇటీవల రైడ్ 2 సినిమాలో తమన్నా నషా పాటలో మతిపోగొట్టేసింది. ఈ సాంగ్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయ్యింది. అయితే ఈ పాటకు దాదాపు రూ. 5 కోట్ల వరకు పారితోషికం తీసుకున్నారని టాక్. ఇక ఇప్పుడు వినిపిస్తున్న సమాచారం ప్రకారం తమన్నా మరోసారి తన రెమ్యునరేషన్ పెంచేసిందట. ఇటీవల గోవాలో జరిగిన ఓ ఈవెంట్ లో 6 నిమిషాల డ్యాన్స్ కోసం దాదాపు రూ. 6 కోట్లు తీసుకుందట. ఇప్పుడు ఇదే న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో వైరలవుతుంది. సినిమాలు లేకపోయినా.. తమన్నా డిమాండ్ చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్.

## బాక్సాఫీస్ వద్ద నటసింహం 'విశ్వరూపం'



65 ఏళ్ల వయసులో నేటి తరం కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు. వరుసగా ఐదు బ్లాక్ బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న ఈ మెగా స్టార్, ఇప్పుడు డబుల్ హ్యాట్రిక్ హిట్‌కు అతి దగ్గరలో ఉన్నారు. అయితే మనందరికీ ఆయన సినిమాల కలెక్షన్ల గురించి తెలుసు కానీ, ఒక సినిమా ఏకంగా మూడు ఏళ్లకు పైగా థియేటర్లో ప్రదర్శితమై ప్రపంచ రికార్డు సృష్టించిందన్న విషయం మీకు తెలుసా? ప్రస్తుత పాన్ ఇండియా సినిమాల కాలంలో కొన్ని వారాలకే థియేటర్ల నుండి సినిమాలు కనుమరుగవుతుంటే, అప్పట్లోనే వెయ్యి రోజులకు పైగా ఆడి చరిత్ర సృష్టించిన ఆ సినిమా ఏది? 50 ఏళ్ల ఈ సుదీర్ఘ ప్రయాణంలో బాలయ్య సాధించిన అద్భుతమైన రికార్డుల గురించి తెలుసుకుందాం.

### 'అఖండ' యాత్ర..

నందమూరి బాలకృష్ణ కెరీర్ లో 'అఖండ' సినిమా ఒక గొప్ప టర్నింగ్ పాయింట్. అప్పటి నుండి మొదలైన ఆయన విజయ యాత్ర నిరంతరాయంగా కొనసాగుతోంది. అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి వంటి వరుస హిట్లు సాధించిన బాలయ్య, ఇటీవలే విడుదలైన 'అఖండ 2' తో కూడా మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం మలినేని గోపీచంద్ దర్శకత్వంలో తన తర్వాతి భారీ ప్రాజెక్టును ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా హిట్ అయితే బాలయ్య ఖాతాలో డబుల్ హ్యాట్రిక్ చేరడం ఖాయం. బాలనటుడిగా వెండితెరకు పరిచయమై, తనదైన శైలిలో స్టార్ డమ్ సంపాదించుకున్న బాలయ్య, ఇటీవలే 50 ఏళ్ల సినీ జీవితాన్ని పూర్తి చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన నటించిన 110 సినిమాల్లో సుమారు 70 సినిమాలకు పైగా 100 రోజులకు పైగా థియేటర్లలో ఆడి రికార్డు సృష్టించాయి. ఇది ఇండియన్ సినిమా హిస్టరీలోనే ఒక అరుదైన ఘనత. ఆయన మాస్ ఇమేజ్, పవర్ ఫుల్ డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను అంతలా కట్టిపడేస్తాయి.

### 3 ఏళ్లు నడిచిన సినిమా..

పూర్వం ఒక సినిమా 100 రోజులు ఆడితే గొప్పగా చెప్పుకునేవారు. కానీ బాలకృష్ణ నటించిన 'లెజెండ్' సినిమా మాత్రం అన్ని రికార్డులను తిరగరాసింది.

బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా కడప జిల్లాలోని ఒక థియేటర్లో ఏకంగా 1000 రోజులకు పైగా (సుమారు 3 ఏళ్లు) ప్రదర్శితమై సంచలనం సృష్టించింది. కేవలం వసూళ్లు మాత్రమే కాదు, జనం మనసులో కూడా ఈ సినిమా అంతగా పాతుకుపోయింది.

ప్రస్తుత డిజిటల్ కాలంలో ఏ సినిమాకు కూడా సాధ్యం కాని రీతిలో 3 ఏళ్ల పాటు ఒక సినిమా థియేటర్లో ఉండటం అంటే అది కేవలం నందమూరి బాలకృష్ణకే సాధ్యమైంది. సినిమాల్లోనే కాకుండా రాజకీయాల్లో కూడా విజయకేతనం ఎగరేస్తున్న బాలయ్య, తన 50 ఏళ్ల ప్రయాణంలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**